PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 328 | విజయవాడ, సోమవారం 30 జూన్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 30 June 2025 | Rs

స్మార్ట్ మీటర్‌ను తిప్పికొట్టారు

- బెంగాల్ ప్రజల ప్రణాళికాబద్ధ ప్రతిఘటన
- ప్రజాందోళనలతో దిగొచ్చిన మమత సర్కారు

5



అల్కరాస్‌కు ఎదురుందా?

- బరిలో సినర్, నొవాక్ జకోవిచ్
- నేటి నుంచి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్

6



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

రోడ్డెక్కిన కరేడు రైతు

- ఇండోసోల్‌కు భూములివ్వబోమని రైతన్నల ప్రతిన
- రోడ్డుపై బైఠాయించిన అన్నదాతలపై పోలీసుల జులుం
- మద్దతుగా వెళ్లిన నేతల అరెస్టు
- ఉలవపాడులో ఉద్రిక్తత

ప్రజాశక్తి -ఉలవపాడు (నెల్లూరు)

నెల్లూరు జిల్లా ఉలవపాడులో ప్రతిపాదిత ఇండోసోల్ సోలార్ పవర్ ప్రాజెక్టు ఉద్రికత్తలకు దారితీస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం బలవంతంగా భూసేకరణకు కసరత్తు చేస్తుండటంతో రైతన్నలు పోరుబాటపట్టారు. ప్రాణాలైనా ఇస్తాం కానీ పచ్చని పంట భూములనిచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన రైతులు ఆదివారం నాడు కలకత్తా- చెన్నై జాతీయ రహదారిపై బైఠాయించి భూసేకరణకు, సోలార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. పోలీసుల ఆంక్షలను, బెదిరింపులను లెక్కచేయకుండా వేలాది మంది రైతులు ఈ ఆందోళనలో భాగస్వాములయ్యారు. రైతన్నల ఉద్యమానికి సిపిఎం, ఆప్, కాంగ్రెస్, విసివై, బిసివై పార్టీ నాయకులు మద్దతు పలికారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా శనివారం నుంచే రైతులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని తెలియడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పదుల సంఖ్యలో రైతులను, ప్రజా సంఘాల మిగతా 2లో

ప్రజల్లోకి వెళ్లాలి

- ప్రజలు మన గురించి ఏమనుకుంటున్నారో అదే ముఖ్యం
- ప్రజాప్రతినిధులు జనంతో అనుసంధానం కావడం దినచర్యగా మారాలి
- ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాల్సిందే : సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాప్రతినిధులందరూ నిత్యం ప్రజల్లో ఉండాలని, నేతలందరూ జనంతో అనుసంధానం కావడం దిన చర్యగా మారాలని పార్టీ ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పరిశీలకులు, కార్పొరేషన్ ఛైర్మన్లకు సిఎం చంద్రబాబు సూచించారు. మనం ఏడాది పాలనలో చేసిన మేలును ప్రజలకు వివరించాలని, అదే సమయంలో వైసిపి చేస్తున్న కుట్రలను తెలియజేయాలన్నారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సభలో జులై 2 నుంచి చేపట్టనున్న 'ఇంటింటికీ టిడిపి' కార్యక్రమంపై నేతలకు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. మనం ఏమి అనుకుంటున్నామనేది ముఖ్యం కాదని, ప్రజలు మన గురించి ఏమనుకుంటున్నారనేదే ముఖ్యమన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, భవిష్యత్తులో ఏమి చేస్తామో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని చంద్రబాబు సూచించారు. వైసిపి పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కిపోయిందని, కూటమి అధికారంలోకి రాగానే విధ్వంసం నుంచి వికాసం వైపునకు రాష్ట్రాన్ని తీసుకెళుతున్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఎమ్మెల్యేతో నిత్యం మాట్లాడతానని, రోజుకు నలుగురు ఎమ్మెల్యేలను పిలిపించి వారి లోపాలు, ఆరోపణలు, ప్రజల్లో మంచి పేరు ఉందా లేక ఇతరత్రా కారణాలేమైనా ఉన్నాయా అనే విషయాన్ని వివరించి వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. లోపాలను సరిదిద్దుకుని ముందుకు వెళితే మంచిదని, అలా కాకుండా వ్యవహరిస్తే అటువంటి వారికి ఓ నమస్కారం పెట్టి పక్కన పెట్టడమేనన్నారు. 2029 ఎన్నికలే తమ టార్గెట్ అని, నెలలు, రోజులు, గంటలు కూడా లెక్కిస్తున్నామని, ప్రజలకు సేవచేయడంలో పోటీ పడాలన్నారు. రాష్ట్రాన్ని ఐదు జోన్‌లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సర్వీస్ సెక్టార్, పరిశ్రమలను ప్రోత్సహించడం, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనివ్వడం ప్రభుత్వ ప్రాధాన్యతలను చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం అయ్యే విధంగా అభూత కల్పనలతో దారుణంగా పోస్టింగ్‌లు పెడుతున్నారని పేర్కొన్నారు. వైసిపి నేత కారు కిందపడి మనిషి చనిపోతే ఆయనను ఆస్పత్రికి పంపకుండా రోడ్డు పక్కన పడేశారన్నారు. రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్‌లను పరామర్శిస్తున్నారని, ఇదెక్కడి రాజకీయమని ప్రశ్నించారు.

పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జులై 2 నుంచి ఇంటింటి ప్రచారం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కూటమి భాగస్వాములు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. సంస్థాగత ఎన్నికలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసి పనిచేయాలని చెప్పారు.

ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

ఆదర్శ్ ఎం సాజిని, శ్రీజన్ భట్టాచార్య

- సహాయ కార్యదర్శిగా ప్రసన్నకుమార్



ఆదర్శ్ ఎం సాజిని | శ్రీజన్ భట్టాచార్య

కోజికోడ్ : స్వతంత్రత, ప్రజాస్వామ్య, సామ్యవాద పునాదులపై దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో కీలక భూమిక పోషిస్తున్న భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) అధ్యక్షులుగా ఆదర్శ్ ఎం సాజిని, ప్రధానకార్యదర్శిగా శ్రీజన్ భట్టాచార్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేరళలోని కోజికోడ్‌లో ఎస్‌ఎఫ్‌ఐ 18వ మహాసభ ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా 87 మందితో కేంద్ర కార్యనిర్వాహక కమిటీ (సెంట్రల్ ఎగ్జిక్యూటివ్)ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అఖిల భారత కార్యదర్శివర్గంలో ఉపాధ్యక్షులుగా సుభాష్ జాకర్, టి నాగరాజు, రోహిదాస్ యాదవ్, సత్యేష్ లేయువ, శిల్పా సురేంద్రన్, ప్రణవ్ ఖర్జీ, ఎం శిశుప్రసాద్, సి మృదుల ఎన్నిక కాగా, సహాయ కార్యదర్శులుగా ఐషీ ఘోష్, జి అరవింద స్వామి, అనిల్ ఠాకుర్, కె ప్రసన్న కుమార్ (ఆంధ్రప్రదేశ్), దేవన్ సజనవ్, పి అహ్మద్ ఎన్నికయ్యారు. కేంద్ర కార్యదర్శివర్గంలో రెండు స్థానాలు, కేంద్ర కార్యనిర్వాహక మిగతా 2లో


ఆంధ్రప్రదేశ్ నుంచి...



కె.ప్రసన్నకుమార్ | పి.రామ్మోహన్ | పల్లవి | ఒ.పరమేష్ | జహీదా

ఎవరి కోసం స్మార్ట్ మీటర్లు?

- అదానీ, షిర్డీసాయి కోసమే బిగిస్తున్నారు
- ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్



Addressing the media, TDP Polit Bureau member Somireddy Chandramohan Reddy said the party would wage a legal battle to expose the "massive scam" in the purchase of electric transformers. "The DISCOMs had suffered huge losses and power consumers were forced to bear the brunt of hefty hikes in power tariff in the form of true-up charges, fixed charges etc.." he alleged.

questioned the need to install meters to farming lands, and why this had to be done in order to get over a debt of Rs. 4,000 Crores. Lokesh even warned that these meters would be removed and taken around on cycles, in case they were installed. Lokesh even advised Jagan to mortgage the latter's palace in Chennai, and pay for this debt, in case he didn't have

స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని లోకేష్ అప్పట్లో ఇచ్చిన నోట్ పైన సోమిరెడ్డి హైకోర్టులో కేసు వేసిన అంశం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇళ్లకు బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు వల్ల వినియోగదారులకు, ప్రజలకు కలిగే లాభం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు నిలదీశారు. వినియోగదారుల గొంతు కోయడానికి, అదానీ, షిర్డీసాయి కంపెనీలను ఉద్ధరించడానికే వీటిని అమరుస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, బిగించిన వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు పెట్టుకోకపోతే కనెక్షన్లు కట్ చేస్తామని, బిల్లులు పెంచుతామని హెచ్చరిస్తున్నారని అన్నారు. రకరకాల అబద్ధాలు చెప్పి బెదిరించి ఇళ్లకు మీటర్లు మారుస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో వైసిపి ప్రభుత్వం మీటర్లు బిగించేందుకు అంగీకరించి అదానీ, షిర్డీసాయి కంపెనీలతో ఒప్పందాలు చేసుకుందన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టిన సమయంలో వామపక్ష పార్టీలు, రైతు సంఘాలు పెద్దయెత్తున ఉద్యమం చేశాయని తెలిపారు. టిడిపి, బిజెపి, జనసేన కూడా స్మార్ట్ మీటర్లను ఆనాడు తీవ్రంగా వ్యతిరేకించాయని చెప్పారు. విజయవాడలో స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత చిరు వ్యాపారులకు విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చాయని చెప్పారు. ఈ అంశంపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించి విచారణ జరిపిస్తామని ప్రకటించడంతోపాటు ఆ మీటర్లను మార్చాలని చెప్పారని గుర్తుచేశారు. గృహ వినియోగదారులకు బిగిస్తే వాస్తవికంగా వాడుకున్న విద్యుత్‌కే బిల్లులు వస్తాయనే హామీ ఇవ్వగలరా? అని నిలదీశారు. ప్రైవేట్ కంపెనీలు, ఉత్పత్తిదారులు, కార్పొరేట్ల లాభాల కోసం స్మార్ట్ మీటర్ల రూపంలో విద్యుత్ వినియోగదారులపై లక్షల కోట్ల భారాలు వేయదలుచుకున్నారా? అని ప్రశ్నించారు. ఒక్కో స్మార్ట్ మీటర్ రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు ఖర్చవుతుందని, ప్రతినెలా ఇచ్చే విద్యుత్ బిల్లులో దీనిని కలుపుతారని చెప్పారు. రాష్ట్రంలోని వినియోగదారులపై ఏడాదికి భారం రూ.50 వేల కోట్లు ఉంటుందన్నారు. ఈ అంశంపై కరపత్రాలు ద్వారా తాము ప్రజలకు వివరిస్తున్నామని, ప్రజలు అంగీకరించి వీటికి వ్యతిరేకంగా దరఖాస్తులపై సంతకాలు చేస్తున్నారని చెప్పారు. ఈ మీటర్ల బిగింపును ప్రజలు ప్రతిఘటించాలని, ఇంటికి వచ్చే అదానీ సిబ్బందిని వెనక్కి పంపించాలని కోరారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం ఈ అంశంపై ముందుకెళితే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. కేంద్రం ఆదేశాలకు లొంగకుండా ప్రజల క్షేమం కోరుకుంటే వెంటనే స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేసేందుకు వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలతో సంప్రదిస్తున్నామని, ఈ అంశంపై సోమవారం వామపక్ష పార్టీలు సమావేశమై భవిష్యత్ కార్యక్రమంపై చర్చిస్తామన్నారు.

లోకేష్ పిలుపు ఏమైంది

యువగళం పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని మంత్రి లోకేష్ మిగతా 2లో

విశాఖ భూములపై 'పతంజలి' కన్ను!

- శారదాపీఠానికి ఇచ్చిన భూములు కట్టబెట్టే యత్నం
- యోగా సెంటర్ పేరిట ప్రభుత్వ భూములకు గాలం
- బాబాలు, స్వాములకు ప్రభుత్వ భూముల బదలాయింపు తగదు : ఇఎఎస్.శర్మ



గతంలో శారదా పీఠానికి కేటాయించిన స్థలం పరిశీలిస్తున్న రామ్‌దేవ్, చిత్రంలో జిల్లా అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పాలకులు మారినా విధానాల్లో ఏ మార్పూ రాలేదనడానికి విశాఖ జిల్లాలో ప్రభుత్వ భూములను స్వాములు, బాబాలకు కట్టబెట్టే ఉదంతాలే ప్రత్యక్ష తార్కాణం. వ్యాపారాల్లో ఆరితేరిన పతంజలి సంస్థ అధిపతి, ఆధ్యాత్మిక యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు విశాఖ జిల్లాలో టూరిజం, యోగా వెల్‌నెస్ సెంటర్ల స్థాపన పేరుతో రూ.వందల కోట్ల విలువైన భూములను కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాకు చెందిన రెవెన్యూ ఉన్నతాధికారులు సైతం మూడు రోజుల క్రితం రామ్‌దేవ్ బాబా విశాఖ జిల్లా పర్యటనలో భాగస్వాములవుతూ భూములు ఎక్కడ కావాలో చెప్పండంటూ కోరడం విస్మయం కలిగించే అంశం.

విశాఖ జిల్లా భీమునిపట్నం ఏరియాలో స్వాములు, బాబాలకు ప్రభుత్వం భూములు కట్టబెట్టే పనులు చకచకా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు, పొరపాట్లను సరిదిద్ది వ్యవస్థలను నిలబెడతామంటూ చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు అవే తప్పులను పదేపదే చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో శారదాపీఠం (స్వరూపానంద స్వామి)కు సుమారు రూ.220 కోట్లకుపైగా విలువ చేసే 15 ఎకరాలను కట్టబెట్టారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ జిఒలను రద్దు చేసి ఇప్పుడు మరో బాబాకు దాసోహం అంటోంది. దేశంలో పలుచోట్ల కంపెనీల కోసమని భూములను తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న 'పతంజలి' ఉత్పత్తుల అధినేత రామ్‌దేవ్ బాబాకు భీమిలిలో 15 ఎకరాలను కట్టబెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైందన్నది స్పష్టమవుతోంది. శారదాపీఠానికి నాడు కేటాయించిన 15 ఎకరాలపై రామ్‌దేవ్ బాబా ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది.

గతంలో జరిగిందే.. నేడూ రిపీట్

శారదాపీఠానికి భీమిలి మండలం కొత్తవలస గ్రామంలో సర్వే నెంబర్ 102/2లో 7.30 ఎకరాలు, సర్వే నెంబర్ 103లో 7.3 ఎకరాలను సంస్కృతిక పాఠశాల, వేదిక్ ఎడ్యుకేషన్ కోసమని గత ప్రభుత్వం ఎకరాను రూ.లక్షకు ధారాదత్తం చేసింది. 2024లో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి మిగతా 5లో

జనగణనలో తొలిదశ ఖరారు

- ఏప్రిల్ 1 నుంచి హౌస్ లిస్టింగ్

న్యూఢిల్లీ: జనగణన - 2026లో తొలి దశకు షెడ్యూలు ఖరారైంది. రెండు దశలుగా చేపట్టే జనాభా లెక్కల సేకరణలో తొలి దశగా గృహాల గుర్తింపు, ఆస్తుల వివరాలను (హౌస్ లిస్టింగ్) గణింపు చేస్తారు. ఆ తర్వాత ఇంటింటికి వెళ్లి జనాభా వివరాలు సేకరిస్తారు. గృహాల గుర్తింపు (హౌస్ లిస్టింగ్) కార్యకలాపాలు 2026 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతాయని భారత జనాభా లెక్కల కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. పర్యవేక్షకులు, గణకుల నియామకాలు రాష్ట్రాలు, జిల్లా పరిపాలన సహకారంతో జరుగుతుందని వెల్లడించారు. జనగణనతో పాటు కుల గణన కూడా జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటనలో తెలిపింది. జనగణన కార్యకలాపాల కోసం 34 లక్షలకు పైగా గణకులు, పర్యవేక్షకులు, సుమారు 1.3 లక్షల జనాభా గణన కార్యకర్తలను నియమించనున్నారు.

పూరీలో తొక్కిసలాట

- ముగ్గురు మృతి
- పలువురికి గాయాలు
- రథయాత్ర నిర్వహణలో బిజెపి సర్కార్ వైఫల్యం



భువనేశ్వర్ : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో మరోమారు విషాదం చోటుచేసుకుంది. పూరీ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం గుండీచా దేవాలయం వెలుపల జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 50 మంది పైగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ఒడిషా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్హీ వ్యక్తిగతంగా, ప్రభుత్వం తరపున క్షమాపణ చెప్పారు. భద్రతా ఏర్పాట్లలో జరిగిన వైఫల్యాలపై విచారణకు ఆదేశించారు. పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ ఎస్ స్వియాన్, పోలీస్ సూపరింటెండెంట్ బినిత్ అగర్వాల్‌ను బదిలీ చేశారు. పూరీ సిడిపి విష్ణు చరణ్ పాటి, పోలీస్ కమాండెంట్ అజయ్ పథిని సస్పెండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. కాగా తొక్కిసలాటలో మరణించిన వారిని బసంతి సాహు (బోలాగర్హ్), ప్రేమకాంత్ మొహంతి, ప్రవతి దాస్ (బాలిపట్న)గా గుర్తించారు. రథయాత్ర నిర్వహణలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివిపిలకు ప్రోటోకాల్ కల్పించడంలోనే అధికార యంత్రాంగమంతా మునిగితేలిందని బాధితుల బంధువులు తప్పుబట్టారు. ప్రోటోకాల్ ఆంక్షలే తమవాళ్ల ప్రాణాలు తోడేశాయని వాపోయారు. పోలీసులంతా వివిఐపిల భద్రతకు వెళ్లిపోయారని, జనాలను నియంత్రించేందుకు ఎవ్వరూ లేకపోవడం వల్లే తొక్కిసలాట జరిగిందని వారు పేర్కొన్నారు. రద్దీ నేపథ్యంలో శనివారం రాత్రి దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయడంతో గందరగోళం నెలకొంది. ఆ తర్వాత భక్తులను ఒక్కసారిగా లోపలికి అనుమతించడంతో తొక్కిసలాట జరిగింది. దీనికితోడు రథాలను దగ్గర దగ్గరగా మిగతా 5లో

'కరేడు' దమనకాండపై రైతు, కౌలు రైతు సంఘాల ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కరేడు గ్రామ రైతులు, ప్రజలపై పోలీసులు దమనకాండను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండించాయి. మహిళలని చూడకుండా వారిపై దురుసుగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతుల ఆగ్రహాన్ని చవిచూసిన ప్రభుత్వం ఇండోసోల్ సంస్థకు ఇచ్చేందుకు జారీ చేసిన 8,350 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. పరిశ్రమల పేరుతో విలువైన భూములను సేకరించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ఇందుకోసం వ్యవసాయానికి పనికిరాని భూములను, అటవీ బంజరు భూములను, కొండ ప్రాంతంలో ఉన్న భూములను వినియోగించుకోవాలని కోరారు. ప్రైవేటు కంపెనీల కోసం రైతుల జీవితాలను పణంగా పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న రైతులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. ఫలితం సాధించే వరకూ రైతులు పట్టుదలతో నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

వెబ్‌సైట్‌లో వాయిదా 'డిఎస్‌సి' హాల్ టికెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియకు సంబంధించిన డిఎస్‌సి పరీక్షల్లో వాయిదా పడ్డ పరీక్షల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు మెగా డిఎస్‌సి -2025 కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన డిఎస్‌సి పరీక్షలను యోగా దినోత్సవ సందర్భంగా జులై 1, 2 తేదీలకు మార్పు చేశామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు, తేదీలు మార్చిన కొత్త హాల్ టికెట్లను https://apdsc.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచామని వెల్లడించారు. అభ్యర్థులు వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. కొత్త హాల్ టికెట్లలో పరీక్ష కేంద్రాలు, తేదీలు నిర్ధారించుకుని హాజరు కావాలన్నారు.

ప్రిన్సిపల్ పరీక్షకు 92.31 శాతం హాజరు

ప్రిన్సిపల్ పరీక్షకు జరిగిన స్కూల్ అసిస్టెంట్ తెలుగు పరీక్షకు 92.31 శాతం మంది హాజరయ్యారని కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం 19,750 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 18,231 మంది హాజరయ్యారని వెల్లడించారు. ఉదయం పూట జరిగిన పరీక్షలో నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 88.40 శాతం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలో చిత్తూరు జిల్లాలో 97.81 శాతం అత్యధికంగా హాజరయ్యారని వివరించారు.

ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా ఆదర్శ్ ఎం సాజిని, శ్రీజన్ భట్టాచార్య

(మొదటిపేజీ తరువాయి)

కమిటీలో 8 స్థానాలను ఖాళీగా ఉంచారు.

అఖిల భారత అధ్యక్షులుగా ఎన్నికైన ఆదర్శ్ కేరళలో కొల్లంలోని చత్తన్నూర్‌కు చెందినవారు. ఆయన ఇదివరకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, అఖిల భారత సహాయ కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం ఢిల్లీలోని జన్వత్ న్యాయ కళాశాలలో ఎస్‌ఎస్‌బి చివరి సంవత్సరం చదువుతున్నారు. ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన శ్రీజన్ పశ్చిమ బెంగాల్‌లోని జాదవ్‌పూర్‌కు చెందినవారు. ఆయన 'చరిత్ర'లో పట్టభద్రుడు.

ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురికి చోటు

ఏపి నుంచి అఖిల భారత సహాయ కార్యదర్శిగా కె ప్రసన్న కుమార్ ఎన్నికయ్యారు. అలాగే కేంద్ర కార్యనిర్వాహక కమిటీలో పి రామ్మోహన్, ఒ పరమేశ్, పల్లవి, జహిదా ఎన్నికయ్యారు.

ఎవరి కోసం స్మార్ట్ మీటర్లు?

(మొదటిపేజీ తరువాయి)

ఆనాడు ఇచ్చిన పిలుపు ఏమైందని శ్రీనివాసరావు నిలదీశారు. ఎవరికి లొంగిపోయారు? ఎందుకు లొంగిపోయారు? లోకేష్ నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడకుండా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు మాటమార్చి ప్రజలపై భారాలు మోపుతున్నారని తెలిపారు. షిర్డీసాయి, ఇండోసోల్ కంపెనీలపై ప్రతిపక్షంలో టిడిపి నేతలు తీవ్రంగా ధ్వజమెత్తారని గుర్తుచేశారు. సెకి ఒప్పందంపై మంత్రి పయ్యావుల కేశవ్, మీటర్లపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోర్టులో కేసులు కూడా వేశారని గుర్తుచేశారు. 2024 సెప్టెంబర్ తరువాత వీటి గురించి మాట్లాడటం లేదన్నారు. ఈ కేసులపై రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేశవ్, సోమిరెడ్డిని శ్రీనివాసరావు ప్రశ్నించారు. దీనిపై మౌనంగా ఉండటం ఏమాత్రం సమాధానం, సమంజసం కాదని, ప్రజలను వంచించి మోసం చేయడమేనని విమర్శించారు.

అదానీనే ఫైన్ చెల్లించాలి

సెకి ఒప్పందాన్ని ఉపసంహరించుకుంటే ఫైన్ కట్టాలనే నిబంధన ఎక్కడ ఉందని ప్రశ్నించారు. విద్యుత్ అందిస్తామన్న సమయానికి అందించలేకపోయిన అదానీ ఫైన్ చెల్లించాలని అన్నారు. ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు, రూ.1,700 కోట్లు లంచం ఇచ్చి సెకి ఒప్పందం చేసుకున్నందుకు అదానీపై చర్యలు తీసుకోవాలన్నారు. సెకిపై హైకోర్టులో ఉన్న కేసును గట్టిగా నడిపించి నడపకుండా, ఒప్పందాలు రద్దు చేయకుండా, విద్యుత్ ధరలు పెంచి స్మార్ట్ మీటర్లను పెట్టేందుకు ఎగబడటం ప్రజలపై భారాలు వేసేందుకు అని అన్నారు.

బిజెపి ద్వంద్వ విధానం

స్మార్ట్ మీటర్ల అంశంపై బిజెపి ద్వంద్వ విధానం అవలంబిస్తోందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో స్మార్ట్ మీటర్లను అక్కడి ప్రజలు వ్యతిరేకించారని, దీంతో అక్కడి ప్రభుత్వం వీటిని ఉపసంహరించుకుందన్నారు. ప్రజలకు మద్దతుగా తమ పార్టీతో పాటు కాంగ్రెస్, బిజెపి కూడా పోరాటం చేశాయని తెలిపారు. కానీ రాష్ట్రంలో మాత్రం స్మార్ట్ మీటర్లను బలపరుస్తున్నారని, దీనిపై బిజెపి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేరళలో తాము స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నామని, అక్కడ వీటిని బిగించకూడదని వామపక్ష ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. బిజెపి అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో బిగిస్తున్నారని తెలిపారు.

చించినాడ అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం, యలమంచిలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రజాస్వామ్యం ముప్పులో పడిందని, చించినాడ అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో అమరువీరుల 75వ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. చించినాడ పోరాట యోధుడు కేతా సూర్యారావు సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపానికి వి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షత వహించిన సభలో సూర్యారావు రచించిన 'చించినాడు సమరశీల పోరాట చరిత్ర' పుస్తకాన్ని శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... చించినాడ పోరాట పటిమ ఎంతో ఆదర్శమన్నారు. భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని, వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రజలను సమైక్యం చేయడంలో, వారిని పోరాట పంథాలో నడపడంలో అమరజీవి రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) పాత్ర అద్వితీయమైనదని కొనియాడారు. వివిధ ఉద్యమాల్లో మహిళలు వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు.



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అప్రజాస్వామ్యం రాజ్యమేలుతోందని, అధికారంలో ఉన్న వారంతా వ్యవస్థలను నాశనం చేస్తున్నారని, మార్కెట్లో సరుకులు కొన్నట్లు ఓటర్లను కొంటున్నారని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతోందని, వాగ్దానాలు అమలు చేయలేదని చెప్పారు. చంద్రబాబు, జగన్‌లాగే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీల గురించి ఎవరూ మాట్లాడడం లేదన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లు పెడితే వాటిని బద్దలు కొట్టండి అని చెప్పి... కూటమి ప్రభుత్వం వాటిని మళ్లీ ఇప్పుడు బిగిస్తోందని చెప్పారు. దీనివల్ల రూ.50 వేల కోట్ల భారం పడుతుందని, స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రజలు బయటికొచ్చి పోరాడాలని కోరారు. ప్రజల కోసం నిరంతరం, నిజాయతీగా పోరాడేది, బిజెపి అన్యాయంపైన, కార్పొరేట్ల దోపిడీపైన పోరాటం చేసేది ఒక్క సిపిఎం మాత్రమేనని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కార్యదర్శులు అరటికట్ల రవి. జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. ఆచంట మాజీ ఎమ్మెల్యే దిగుపాటి గోపాల్, జిల్లా కమిటీ నాయకులు కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ పాల్గొన్నారు.

భూసేకరణ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇండోసోల్ కంపెనీ కోసం ఉలవపాడులో 8,458 ఎకరాల భూ సేకరణ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ప్రజలపై తీవ్ర నిర్బంధం ప్రయోగించి, భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో దీనిని పెద్ద కుంభకోణంగా టిడిపి, బిజెపి, జనసేన కూటమి పేర్కొన్నాయని తెలిపారు. ఇప్పుడదే కంపెనీకి భూములు కట్టబెట్టడంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జాతీయ రహదారి దిగ్బంధనానికి దిగిన వారిపై పోలీసుల్ని ఉపయోగించి మహిళలు అని కూడా చూడకుండా అక్రమంగా అరెస్టు చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆప్ నేత నేతి మహేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ పట్ల దురుసుగా ప్రవర్తించిన ఉలవపాడు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ నాయకులు మిరియం శ్రీనివాసులు, సిపిఎం నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, జి వెంకటేశ్వర్లు, జివిబి కుమార్, నేతి మహేశ్వరరావు, సుంకర పద్మశ్రీ, సామాజికవేత్త కె వసుంధర, కరేడు పెద్దపల్లిపాలెనికి చెందిన 26 మంది రైతులను పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. పోలీస్ నిర్బంధాన్ని సైతం లెక్క చేయకుండా కదిలిన ప్రజలను తమ పార్టీ అభినందిస్తున్నదని పేర్కొన్నారు. భూసేకరణపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత దృష్ట్యా ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలని, దళిత, గిరిజన బలహీనవర్గాల కాలనీలు ఖాళీ చేయించొద్దని డిమాండ్ చేశారు.

జగన్ బినామీ కంపెనీకి భూములు ఎలా కట్టబెడతారు?

ఇండోసోల్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బినామీ కంపెనీగా గతంలో పేర్కొన్న టిడిపి నేతలు, ఇప్పుడు అదే కంపెనీకి భూములు ఎలా కట్టబెట్టారని వి శ్రీనివాసరావు ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ కంపెనీ వారధిగా ఉందా? అని ప్రశ్నించారు. కంపెనీకి అవసరమైతే రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తాయని ప్రభుత్వానికి అవసరం ఏమిటని నిలదీశారు. ప్రభుత్వం భూములు అప్పగించిన చోట షిర్డీసాయి, ఇండోసోల్ కంపెనీలు పెట్టాయా? అని ప్రశ్నించారు.

వారికీ.. మనకూ తేడా లేకపోతే ఎలా?

- అన్నదాత అర్హుల్లో కోతలు!
- టిడిపి ఎమ్మెల్యేల్లో చర్చ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'సంక్షేమ పథకాలు అమల్లో గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా లేకపోతే ఎలా? రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలుచేయనున్న అన్నదాతా సుఖీభవ పథకంలో అర్హుల సంఖ్యను కుదించింది' అని అంటుంది ప్రజలు కాదు, ప్రతిపక్ష నేతలూ కాదు.. అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలే. తమ నియోజకవర్గంలో అర్హుల్లో కోతలు విధించారంటూ పలువురు ఎమ్మెల్యేలు మంత్రులతో, ఇతర సహచర ఎమ్మెల్యేలతో చర్చించుకుంటున్నారు. ఏ ప్రమాణికంగా అర్హులను కుదించారో అర్థం కావడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిడిపి విస్తృత స్థాయి సమావేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం విరామ సమయంలో అన్నదాతా సుఖీభవపై మంత్రులతో కొంతమంది ఎమ్మెల్యేలు తమ గోడును విన్నవించుకున్నారు. గతం కంటే అర్హుల సంఖ్య తమ నియోజకవర్గాల్లో తగ్గిందని ఎమ్మెల్యేలు మంత్రులతో చెప్పుకుంటున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని ఒక మండలంలో అన్నదాతా సుఖీభవ పథకం లబ్ధిదారుల సంఖ్య తగ్గిందని రాయలసీమకు చెందిన మంత్రితో చెప్పారు. గత ప్రభుత్వం రైతు భరోసా కింద సుమారు 10 వేల మంది అర్హులుగా ఉన్నారని, ఇప్పుడు మాత్రం వీరిలో 4 వేల మందిని అనర్హులుగా చేసి 6 వేల మంది అర్హులుగా ప్రకటించిందన్నారు. అర్హుల కోసం ఎలాంటి ప్రమాణికాలు పాటించిందో అర్థం కాలేదని మంత్రితో ఆ ఎమ్మెల్యే చెప్పారు. గత ప్రభుత్వం విధించిన ఆరు అంచెల విధానాన్నే మన ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి సమాధానం చెప్పారు. విద్యుత్ వినియోగం పెరిగి ఉంటుందని, అందుకనే అర్హులు తగ్గి ఉంటారని మంత్రి ఆ ఎమ్మెల్యేతో అన్నారు. విద్యుత్ వాడకం 300 యూనిట్లు దాటిన వారిని సంక్షేమ పథకాలకు అనర్హులుగా ప్రభుత్వం విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ వినియోగాన్ని ఏడాదికి సరాసరిగా ప్రమాణికంగా తీసుకుంటున్నామని, గత ప్రభుత్వం కూడా ఇదే అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన విధానాలు అమలు చేస్తే ఆ ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి తేడా ఏమిటని ఆ ఎమ్మెల్యే.. మంత్రిని ప్రశ్నించారు. ఈ ఇద్దరి మధ్యనే రాయలసీమకు చెందిన మహిళా ఎమ్మెల్యే అంశం ప్రస్తావనకు వచ్చింది. ఆ ఎమ్మెల్యే కూడా అర్హుల జాబితాలో కోతలు విధించారని చెప్పారని గుంటూరుకు చెందిన ఎమ్మెల్యే అన్నారు.

రోడ్డెక్కిన కరేడు రైతు

(మొదటిపేజీ తరువాయి)

నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అడుగడుగునా ఆంక్షలు విధించారు. జాతీయ రహదారిపై ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేయడానికి వీల్లేదని హెచ్చరించారు. కరేడు గ్రామం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో బలగాలను మోహరింపజేశారు. పోలీసుల ఆంక్షలను అధిగమించి అన్నదాతలు జాతీయ రహదారి చేరుకొని ఆందోళన చేపట్టారు. కరేడు, ఆ చుట్టుపక్క గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రైతుల పోరాటానికి మద్దతుగా వెళ్తున్న సిపిఎం నాయకులు ఇ వెంకటేశ్వర్లు, కుమార్, టి మాల్యాద్రి, ఆప్ కన్వీనర్ నేతి మహేశ్వరరావుతో పాటు సుంకర పద్మశ్రీ (కాంగ్రెస్), రామచంద్రయాదవ్ (భారత చైతన్య యువజన పార్టీ), సామాజిక వేత్త కె వసుంధర తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. రామచంద్రయాదవ్ కరేడు గ్రామం నుంచి ర్యాలీగా జాతీయ రహదారికి వస్తుండగా రామకృష్ణపురం వద్ద పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆయన మరో మార్గంలో... జాతీయ రహదారికి చేరుకుని ఆందోళనలో పాల్గొన్నారు. పచ్చని పంట పొలాలను ప్రయివేటు ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టుకు ఇవ్వబోమని రహదారిపై రైతులు భీష్మించారు. రైతన్నల ఆందోళనతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ప్రయాణికుల ఇబ్బందులను సాకుగా చెబుతూ వెంటనే రహదారిని ఖాళీ చేయాలని పోలీసులు రైతన్నలపై జులుం ప్రదర్శించారు. రైతు సంఘాల నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. అయినా అన్నదాతలు తమ ఆందోళన కొనసాగించడంతో ప్రభుత్వ యంత్రాంగం దిగొచ్చింది. సబ్‌కలెక్టర్ శ్రీపూజ అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. తగిన న్యాయం చేస్తామని, ఆందోళన విరమించాలని రైతులను కోరారు.



కరేడు గ్రామం నుంచి తరలివస్తున్న రైతులు

పచ్చని పంట పొలాలు, భూములను తాము ఇవ్వలేమని, ఆ భూములు కావాలంటే మా శవాలు మీద నుంచి వెళ్లాల్సివుంటుందని రైతులు తేల్చి చెప్పారు. ఇండో సోల్ సోలార్ ప్రాజెక్టుకు 8348 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో సబ్‌కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత పోలీసులు మళ్లీ రైతన్నలపై జులుం ప్రదర్శించారు. ఆందోళనకారులకు మద్దతుగా వెళ్లిన సిపిఎం, ఆప్, కాంగ్రెస్, విసివై, బిసివై నాయకులను అరెస్ట్ చేసి కందుకూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. జాతీయ రహదారి నుంచి అన్నదాతలను చెదరగొట్టారు. అరెస్టు చేసినవారిని సిపిఎం నాయకులు మూలం రమేష్, ఎం పుల్లయ్య, పి పెంచలయ్య పరామర్శించారు. కేసు నమోదు చేసిన అనంతరం సొంతపూచీకత్తుపై నాయకులను విడుదల చేశారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి యత్నం

- రైల్వే పోలీసుల కాల్పులు
- తప్పించుకున్న దుండగులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం తెల్లవారుజామున ఏడుగురు దుండగులు దోపిడీకి యత్నించారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామ సమీపంలో జరిగింది. రైల్వే పోలీసులు కాల్పులు జరపడంతో దుండగులు తప్పించుకుని పారిపోయారు. ఈ మేరకు వివరాలను పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో గుంటూరు జిఆర్‌పిఎస్ డిఎస్‌పి అక్కేశ్వరావు ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్ నుండి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు తుమ్మలచెరువు సమీపంలోకి రాగానే గుర్తుతెలియన దొంగలు ఎస్4, ఎస్7 భోగిల్లో అలారమ్ చైను లాగి ప్రయాణీకుల వద్ద బంగారం, డబ్బు దోచుకునేందుకు యత్నించారు. రైలు నిలిచిపోవడంతో అప్రమత్తమైన తెనాలి రైల్వే ఎస్ఐ వెంకటాద్రి, మరో ఇద్దరు సిబ్బంది వెంటనే అప్రమత్తమై విజిల్స్ వేయడంతో భయపడిన దుండగులు పారిపోయేందుకు ప్రయత్నించారు. లొంగిపోవాలని హెచ్చరించగా కంకర రాళ్లతో దాడి చేశారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే, దుండగులు పట్టుబడలేదని, ప్రాణ, ఆస్తి నష్టమేమీ వాటిల్లలేదని డిఎస్‌పి అక్కేశ్వరరావు తెలిపారు. గతంలో ఇదే ప్రాంతంలో పలుమార్లు రైళ్లలో దోపిడీలు జరిగాయని, హైవేకు దగ్గరగా ఉండడంతో దొంగతనం చేసిన వెంటనే తప్పించుకునేందుకు వీలుగా ఉంటుందని దుండగులు ఈ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారని చెప్పారు. దోపిడీకి యత్నించిన వారు పొరుగు రాష్ట్రలకు చెందిన వారిలా ఉన్నారని తెలిపారు. శనివారం తెల్లవారుజామున కూడా న్యూ పిడుగురాళ్ళ రైల్వే స్టేషన్‌లో ఓ ఎక్స్‌ప్రెస్ రైలులో దోపిడీ జరిగిందని, ఇద్దరు మహిళల నుండి 45 గ్రాములు బంగారాన్ని దోచుకున్నారని, దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని అక్కేశ్వరరావు తెలిపారు.

సైన్స్‌ను రాజకీయం చేయొద్దు

- పిటిఎఫ్ఇ వల్ల హాని లేదని నిరూపించాలి
- పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ కె బాబూరావు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు మండలం గొందిపర్లలోని టిజివి ఎస్ఆర్ఎఎసి పరిశ్రమ విస్తరణలో భాగంగా పిటిఎఫ్ఇ (పాలీటెట్రా ఫ్లోరో ఇథలీన్) ఉత్పత్తికి వాడే రసాయనాల వల్ల హాని లేదని శాస్త్రీయంగా నిరూపించాలని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ కె.బాబూరావు డిమాండ్ చేశారు. టిజివి పరిశ్రమ విస్తరణలో ఉత్పత్తి చేసే రసాయనాల ప్రభావంపై ఆదివారం కర్నూలులోని బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాలులో ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో బాబూరావు మాట్లాడుతూ పిటిఎఫ్ఇ ఉత్పత్తి, రసాయనాల ప్రభావంపై వివరించారు. మోడీ ప్రభుత్వం పర్యావరణ చట్టాల్లో మార్పులు చేసి చట్టాలు పనికిరాకుండా చేశారన్నారు. పిటిఎఫ్ఇ ఉత్పత్తి 1950 నుంచి అమెరికాలో ప్రారంభమైందన్నారు. పిటిఎఫ్ఇ తయారీ చాలా క్లిష్టమైన ప్రక్రియ అని, అణువులను జోడించి తయారు చేస్తారని తెలిపారు. ఆ ప్రక్రియలో సర్ఫాక్టెంట్స్ ఖచ్చితంగా వాడతారన్నారు. పిటిఎఫ్ఇ తయారీలో పిఎఫ్ఓఎ (పెర్ఫ్లోరో ఆక్టానిక్ యాసిడ్) వాడతారని, అది చాలా ప్రమాదకరమని తెలిపారు. పిఎఫ్ఓఎకు ప్రత్యామ్నాయంగా వాడే ఫ్లోరిన్ రసాయనాలు, హెచ్‌పిఎఫ్ఒ డైమర్‌యాసిడ్ కూడా ప్రమాదకరమేనన్నారు. ఆ రసాయనాల వల్ల మూత్రపిండాల, వృషణాల కేన్సర్లు, శ్వాసకోశ ఇబ్బందులు, దీర్ఘకాలిక రోగాలు వస్తాయని తెలిపారు. బలభద్రపురంలో కేన్సర్ ఉధృతి పెరిగిందని, ఇక్కడ కూడా అలాంటి పరిస్థితే ఉంటుందని పేర్కొన్నారు. గుజరాత్‌లో పిటిఎఫ్ఇ విషవాయువులు పీల్చి నలుగురు చనిపోయారని, పిటిఎఫ్ఇ వల్ల ప్రమాదాల గురించి అనేక అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు. తాను సైన్స్ విషయాలు చెబుతుంటే అసత్య ప్రచారం చేస్తున్నారని, సైన్స్‌ను రాజకీయం చేయొద్దని అన్నారు. తెలంగాణ సరిహద్దుల్లో ఉన్నప్పుడు వాళ్ల పాత్ర లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ ఎలా చేస్తారని, ప్రజల అభ్యంతరాలు తెలుసుకోవడంలో ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. పిటిఎఫ్ఇకి మండే స్వభావం ఉందని, పేలుడు జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. సదస్సులో జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు మహమ్మద్ మియా, ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్ర వేత కె.బాబూరావు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారానికి నేతలు కృషి చేయాలని, మంచి పనులు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పార్టీ శ్రేణులకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ జులై 5 నాటికి పార్టీ కమిటీలన్నింటినీ పూర్తి చేయాలన్నారు. డోర్ టు డోర్ ఫీడ్ బ్యాక్‌ను ప్రజల నుంచి తీసుకుని టిడిపి యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. జులై 2 నుంచి నెల రోజులు చేపట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలు, నేతలకు విజ్ఞప్తి చేశారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా తల్లికి వందనం అమలు చేశామని, ఎన్నికల్లో తామిచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పార్టీ వ్యవస్థలో మహిళలను పెద్దయెత్తున భాగస్వాముల్ని చేస్తామని, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలన్నారు. సీనియర్ల సహకారంతో యువతకు ఉన్న శక్తిని జోడించాలని, ప్రతి జిల్లా, నియోజకవర్గంలో పార్టీ కార్యాలయాలను అన్ని ప్రాంతాల్లో నిర్మించాలన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం బాగా చేసిన వారిలో మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నారన్నారు. బాగా పనిచేసిన కార్యకర్తలను సత్కరించాలన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మహాసభకు 730 కిలోమీటర్ల బైకు ప్రయాణం

- 'సోషలిజమే భవిష్యత్' నినాదంతో వెళ్లాం : యువకులు

తిరువనంతపురం : 'స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం' నినాదంతో ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని భుజాన ఎత్తుకొని నలుగురు యువకులు 730 కిలోమీటర్లు ప్రయాణించారు. కేరళలోని కోజికోడ్‌లో ఈ నెల 27న ప్రారంభమై 30వ తేదీ వరకూ జరుగుతున్న ఎస్‌ఎఫ్‌ఐ 18వ అఖిల భారత మహాసభకు ఎస్‌వి యూనివర్సిటీ నుంచి ఆ యువకులు బైకుపై వెళ్లారు. తిరుపతికి చెందిన రవి, అక్బర్, వినోద్, నంద్యాలకు చెందిన ఎంఆర్ నాయక్ కలిసి ఈ నెల 22న తమ ప్రయాణాన్ని ప్రారంభించారు. తిరుపతి, చిత్తూరు, తమిళనాడులోని కృష్ణగిరి, ధర్మపురి, గోబీ చీటిపాళ్యం, ఊటీ, కేరళలోని వయనాడ్, తమారస్సరీ మీదుగా కోజికోడ్‌కు వీరి ప్రయాణం సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దారి పొడవునా ప్రకృతిని ఆస్వాదించడంతోపాటు పొలాల్లో పనిచేస్తున్న కర్షకుల జీవన విధానాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేశామన్నారు. ప్రజలందరి కోసం అవసరమైన పంటలన్నీ పండిస్తున్న వారి శ్రమకు తగిన ఫలితం అందితే వారి జీవితాలు మరింత మెరుగవుతాయని అన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆ విధంగా పనిచేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య అందితే ఎంత మెరుగైన జీవన విధానం ఉంటుందో కేరళ వాసులతో మాట్లాడితే అర్థమైందని అన్నారు. వయనాడ్ జిల్లాలోని ప్రజలతో మాట్లాడామని, వారు ఎంతో చైతన్యవంతంగా, ఆరోగ్యంగా, ప్రేమతో ఉన్నారని చెప్పారు. రాజ్యాంగంలోని 'సోషలిజం' పదాన్ని తొలగించాలని, సోషలిజానికి భవిష్యత్ లేదని ప్రచారం చేస్తున్న పాలకులున్న తరుణంలో 'సోషలిజమే భవిష్యత్' అంటూ ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని వెంట తీసుకొని 730 కిలోమీటర్లు ప్రయాణం చేయడం తమ జీవితంలో మరపురాని ఘట్టమని అన్నారు.

కమ్యూనిస్టుల ఐక్యత అవసరం

- మద్దికాయల ఓంకార్ శత జయంతి సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత అవసరమని సెమినార్‌లో వక్తలు పేర్కొన్నారు. ఎంసిపిఐ(యు) సీనియర్ నేత మద్దికాయల ఓంకార్ శత జయంతి సందర్భంగా 'వర్తమాన రాజకీయ పరిస్థితులు-కమ్యూనిస్ట్ ఉద్యమ ఐక్యత-సామాజిక న్యాయం-కర్తవ్యాలు' అనే అంశంపై విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం సెమినార్ జరిగింది. ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు టి శివయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం మాట్లాడుతూ.. బహుజనులు, కార్మికవర్గానికి రాజ్యాధికారం రావాలనేది ఓంకార్ ఆశయమని, ఆ దిశగా ముందుకు సాగుదామని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మతోన్మాదులు ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను ఎప్పటికప్పుడు గ్రహించి, వాటికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమాలు చేయాలని చెప్పారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ.. లాల్, నీల్ మైత్రి ఐక్యతతో మనువాద శక్తులను తిప్పికొట్టాలన్నారు. ఎంసిపిఐ(యు) తెలంగాణ కార్యదర్శి గోని రవి, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్ బాబు మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో బిజెపి ప్రభుత్వం గిరిజనులపై దాడులు చేస్తూ ప్రశ్నించే గొంతులను నొక్కుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యుసిఐ నాయకులు కె సుధీర్, ఆర్‌ఎస్‌పి నాయకులు, జానకి రాములు, ఎంసిపిఐ(యు) నాయకులు ఎస్‌కె ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.


మైక్రో ఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల వేధింపులు అరికట్టాలి : ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మైక్రో ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారుల వేధింపులను అరికట్టాలని కోరుతూ జులైలో ఐద్వా రాష్ట్ర కమిటీ మహిళల్లో ప్రచారం చేయనుంది. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ సమావేశం అధ్యక్షులు ప్రభావతి అధ్యక్షతన వడ్డేశ్వరంలో ఆదివారం జరిగింది. సమావేశం వివరాలను రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి వివరిస్తూ.. ఆగస్టు 23, 24 తేదీల్లో ఢిల్లీలో మైక్రో ఫైనాన్స్ అప్పులపై పబ్లిక్ హియరింగ్ జరగనుందని, రాష్ట్రం నుంచి బాధిత మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని అక్రమాలను వివరించనున్నారని తెలిపారు. జులై 29న రాష్ట్రంలో ఈ అంశంపై ప్రజాదర్బార్ జరపనున్నా మని, వడ్డీ వ్యాపారుల బారి నుంచి విముక్తికి ఉద్యమించాలని ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో వడ్డీ వ్యాపారస్తులు, వారాల వడ్డీలు, మైక్రో ఫైనాన్స్ సంస్థల చేతుల్లో మహిళలు చిక్కుకుని విలవిలలాడుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కుప్పం నియోజకవర్గంలో మహిళను కట్టేసి కొట్టారని, మదనపల్లిలో వడ్డీ వ్యాపారులు రూ.20 నుంచి రూ.45 వరకూ వడ్డీ వసూలు చేస్తున్నట్లు బహిరంగంగానే చెబుతున్నారని తెలిపారు. ప్రతిచోటా వారాల పేరుతో రూ.3 నుంచి రూ.10 వరకూ వడ్డీ వసూలు చేస్తున్నట్లు చెప్పారు. తల్లికి వందనం డబ్బు పిల్లల ఫీజులకు కాకుండా మైక్రో ఫైనాన్స్ సంస్థలకు జమవుతున్నాయని తెలిపారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలను, వడ్డీ వ్యాపారులను రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించాలన్నారు. పొదుపు గ్రూపుల నుంచి అక్రమ వసూళ్లను అరికట్టాలని కోరారు. పొదుపు గ్రూపులకు అంతర్గత రుణపద్ధతిని ప్రోత్సహించాలని, వడ్డీ వ్యాపారుల బారి నుంచి మహిళలను విముక్తి చేయాలని కోరారు.

సీనియర్ జర్నలిస్ట్ దివాకర్ మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



దివాకర్ (ఫైల్)

సీనియర్ జర్నలిస్ట్ పైలా దివాకర్ (63) ఆదివారం మధ్యాహ్నం విశాఖ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య రమణి ఉన్నారు. కొంతకాలం ప్రజాశక్తి విశాఖపట్నం అడ్వర్టైజ్‌మెంట్ విభాగం ఇన్‌ఛార్జిగా పనిచేసిన దివాకర్ వైజాగ్ జర్నలిస్ట్స్ ఫోరం (విజెఎఫ్)కు రెండు పర్యాయాలు కార్యవర్గ సభ్యునిగా ఎన్నికయ్యారు. దశాబ్దకాలంగా వైసిపి విశాఖ జిల్లా పిఆర్‌ఒగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. దివాకర్ మృతి పట్ల ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, పూర్వ మేనేజర్ ఎస్.సుధాకర్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖ నగర అధ్యక్షులు పి.నారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి జిల్లా)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం పివిపురం పంచాయతీ పరిధిలోని రామిరెడ్డిపురంలో మామిడి చెట్లు నరికేసిన రైతులను నేతలు ఆదివారం కలిశారు. క్షేత్రస్థాయిలో మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకటనలకే పరిమితమవుతోందని, మామిడి గుజ్జు ఫ్యాక్టరీల యజమానులు, వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి రైతుల నుంచి కేజీ రూ.2లకు కొనుగోలు చేసి మోసం చేస్తున్నారని తెలిపారు.

మామిడి పంటకు మద్దతు ధర కరువవుతోందని, మామిడి చెట్లను నరికేసి ప్రత్యామ్నాయ పంటలైన వరి, వేరుశనగ పంటలు పండించడానికి రైతులు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ రాష్ట్రంలో పొగాకు, మిర్చికి బోర్డులు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తున్నప్పుడు మామిడి పంటకు ఎందుకు మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయరని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణమే మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి రైతులకు ప్రభుత్వమే కేజీకి రూ.12లు మద్దతు ధర చెల్లించి మామిడి కాయలను కొనుగోలు చేయాలని తెలిపారు. మామిడి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు.


నరికేసిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న ప్రభాకర్ రెడ్డి, హేమలత తదితరులు

పెద్దారెడ్డిని వెనక్కు పంపిన పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోమారు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని భావించి తాడిపత్రికి వెళుతున్న కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు మూడు సార్లు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టుకు వెళ్లి తాడిపత్రికి వెళ్లేందుకు పెద్దారెడ్డి అనుమతి తెచ్చుకున్నారు. ఆదివారం ఉదయం 7-30 గంటల ప్రాంతంలో పెద్దారెడ్డి తన స్వగ్రామం యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామం నుంచి తాడిపత్రి పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లారు. ముందస్తు అనుమతిలేకుండా రావడంపై పోలీసులు అభ్యంతరం తెలుపుతూ ఆయన్ను తిరిగి బలవంతంగా పంపిచేశారు. జెసి ప్రభాకర్‌రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని తనను అడ్డుకుంటున్నారని, ఎళ్లకాలం ఈ రాజకీయాలు చెల్లవని, తమ టైం వచ్చినప్పుడు తాము కూడా ఇంతకింత చేస్తామని పెద్దారెడ్డి తెలిపారు.

'పెద్దారెడ్డి పర్యటనను తప్పకుండా అడ్డుకుని తీరుతామని, వైసిపి కార్యకర్తలు శత్రువులు కాదని, కేవలం పెద్దారెడ్డి మాత్రమే తమకు శత్రువని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.


అభివాదం చేస్తున్న జెవివి నాయకులు, ఆహ్వాన సంఘం సభ్యులు

జెవివి రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో జరిగే జన విజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభకు ఆహ్వాన సంఘం ఏర్పాటైంది. ఆహ్వాన సంఘానికి చైర్మన్‌గా ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయనగరంలోని ఎపిఎన్‌జిఒ హోంలో జెవివి రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక, ప్రజా సంఘాల, సామాజిక, సేవా సంస్థలకు చెందిన ప్రముఖులు దాదాపు 200 మందితో ఆహ్వాన సంఘం ఏర్పడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జెవివి రాష్ట్ర కార్యదర్శి కె.త్రిమూర్తులు మాట్లాడుతూ.. తెలుగు ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించాలని, జీవించాలని గత 37 ఏళ్లుగా జెవివి అవిరామ కృషి చేస్తోందన్నారు. శాస్త్రవేత్తలు, వైద్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, మహిళలు, మేధావులు, వృత్తి నిపుణులు.. ఇలా దాదాపు 30 వేలకు పైగా సభ్యులున్న అతి పెద్ద సైన్స్ ప్రచార సంస్థ జనవిజ్ఞాన వేదికని వెల్లడించారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి ఎంవిఎన్ వెంకటరావు, పి.రమణప్రభాత్, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి కె.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న గిరిజనులు

గిరిజన ఇంజనీరింగ్, కాలేజీ యూనివర్సిటీ పూర్తి

- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్

ప్రజాశక్తి -పార్వతీపురం

గిరిజన యూనివర్సిటీ, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం కేంద్రంగా మంజూరైన గిరిజన ఇంజనీరింగ్ కళాశాల పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. గిరిజన సమస్యలు పరిష్కరించాలని పార్వతీపురం మండలం కొత్తవలసలో ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ.. మెంటాడలో నిర్మిస్తున్న గిరిజన యూనివర్సిటీ నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి చేయకపోవడం గిరిజనులను మోసగించడమేనని, తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మొదటి సంతకం గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో ఎఎన్‌ఎంలను నియమించడమే అని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి ప్రకటించి నేటికి ఏడాదైనా దాని ప్రస్తావనే లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఆదివాసీల ప్రధాన సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర వైఫల్యం చెందిందని విమర్శించారు. అరకు ఎన్నికల సభలో జిఒ 3కు చట్టబద్ధత, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సిపై చంద్రబాబు ఇచ్చిన హామీలు నేటికి అమలుకు నోచుకోలేదని విమర్శించారు.

సీతంపేట, కురుపాం, పార్వతీపురం, సాలూరు కేంద్రాల్లో ప్రారంభించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పనులను పూర్తి చేయాలని, గిరిజన సంక్షేమ హాస్టల్లో ఆరోగ్య కార్యకర్తలు, భాష విద్యా వాలంటీర్లు, సిఆర్‌టిలను నియమించాలని, మూతబడిన పాఠశాలలను తక్షణమే పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలు షెడ్యూల్ ఏరియాలో కలపాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, గిరిజన సంఘం సీనియర్ నాయకులు ఎం.తిరుపతిరావు సంపూర్ణ మద్దతు తెలిపారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని 5న ఆందోళనలు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ జులై 5న సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండల కేంద్రంలో సిపిఐ నాయకుడు లక్ష్మన్న స్తూపం ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించకూడదని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు చెప్పారన్నారు. అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను బిగించేందుకు ఆయనే అనుమతులు ఇస్తున్నారన్నారు. తెలంగాణలో మహాన్యూస్ స్టూడియోపై బిఆర్‌ఎస్ కార్యకర్తల దాడి సరికాదన్నారు. కళ్యాణదుర్గం కేంద్రంగా జరిగిన ఈ-స్టాంపుల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు.

పోటీ పరీక్షల ప్రత్యేకం



కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

కరెంట్ అఫైర్స్.. జనరల్ నాలెడ్జ్

2026, 2027లో రెండు విడతలుగా జనగణన

దేశంలో రాబోయే రెండేళ్లలో రెండు దశల్లో జనగణన జరగనుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వ జనగణన ఇది. దేశానికి మొత్తం 16వది. 2026, అక్టోబర్ 1 నుంచి హిమాలయ ప్రాంతాల్లో మొదటి దశ, 2027, మార్చి 1 నుంచి మిగతా దేశంలో రెండో దశ జరగనుంది.

2026 జనగణనలో తొలిసారిగా కులగణన కూడా జరుగనుంది. 34 లక్షల మంది సిబ్బంది ఇందులో పాల్గొనబోతున్నారు. డేటా ట్యాబ్లెట్ల ద్వారా పూర్తిగా డిజిటల్‌గా సేకరిస్తారు. ప్రజలకు పోర్టల్ ద్వారా స్వయంగా వివరాలు నమోదు చేసుకునే వీలుంది. ఈ ప్రక్రియ జనగణన చట్టం, 1948 ప్రకారం జరుగుతుంది.

- 16 ఏళ్ల విరామం తర్వాత, దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ 2026 అక్టోబర్ 1 నుంచి ప్రారంభం కానుంది.
- మొదటి దశలో జమ్మూ కశ్మీర్, లఢక్ ఉత్తరాఖండ్; హిమాచల్ ప్రదేశ్‌లో 2026, అక్టోబర్ 1 నుంచి.
- రెండో దశలో దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో 2027, మార్చి 1 నుంచి.
- ఈ సారి జనగణనలో కులగణన కూడా జరగనుంది.
- మొత్తం 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పాల్గొంటారు.
- జనగణన ప్రక్రియ పూర్తిగా మొత్తం డిజిటల్ ట్యాబ్లెట్ల ద్వారానే జరుగుతుంది.
- దేశంలోని ప్రజలంతా తమ వివరాలను ఆన్‌లైన్‌లో (పోర్టల్/యాప్ ద్వారా) స్వయంగా నమోదు చేసుకోవచ్చు.
- డేటా భద్రత బాధ్యతలను కేంద్ర హోంమంత్రిత్వశాఖ పర్యవేక్షించనుంది.
- 1931 తర్వాత తొలిసారిగా జనగణనలో 'మీ కులం ఏంటి?' అనే ప్రశ్న అడుగుతారు.
- గతంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు గురించి మాత్రమే డేటా తీసుకున్నారు.
- 2021లో జనగణన కోసం: రూ.8,754.23 కోట్లు.

NPR (జాతీయ జనాభా నమోదు): రూ 3,941.35 కోట్లు.

మొత్తం అంచనా (2021): రూ 12,695.58 కోట్లు.

ఇప్పటి అంచనా (2025-26): రూ 13,000 కోట్లు.

2025-26 బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం: రూ.574.80 కోట్లు.

జనగణనలో : ప్రజల వయస్సు, లింగం, మతం, విద్య, వృత్తి, నివాస స్థలం వంటి వివరాలను సేకరించి, ఆ సమాచారాన్ని ప్రభుత్వ విధానాలు రూపొందించేందుకు ఉపయోగించే గణాంక ప్రక్రియ.





- మొదటి జనగణన 1872లో జరిగింది
- చివరిసారిగా కుల గణన 1931లో జరిగింది
- చివరి జనగణన జరిగిన సంవత్సరం 2011
- ముందుగా జరగాల్సిన సంవత్సరం: 2021 (కోవిడ్ వల్ల వాయిదా)
- జనగణన చట్టం 1948, సెక్షన్ 3 ప్రకారం నిర్వహణ
- తొలిసారిగా జనగణన, కులగణన రెండు ఒకేసారి నిర్వహించేది 2026లో
- ఏమేమి పొందుపర్చుతారంటే
- జనాభా సంఖ్య
- కుటుంబ సభ్యుల వివరాలు
- విద్యా స్థాయి
- జీవన ప్రమాణాలు
- వలస సమాచారం
- సామాజిక వర్గాలు (కులాలు, జాతులు)
- పౌరసత్వ సమాచారం
- వయస్సు, లింగం, మతం, భాషలు మొదలైనవి
- మొబైల్ యాప్ ఆధారిత డేటా సేకరణలో NPR (National Population Register) అనుసంధానం
- భౌగోళిక సమాచారం (జియోగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ +IS) ఆధారిత మ్యాపింగ్
- ఇంటింటికీ డిజిటల్ ఫారమ్ లెక్కింపు

కేంద్ర సాహిత్య అకాడమి-2025 అవార్డులు

యువ, బాల సాహిత్య అవార్డులను జూన్ 18న కేంద్ర సాహిత్య అకాడమీ ప్రకటించింది.

- తెలుగులో గంగిశెట్టి శివకుమార్ రాసిన 'కబుర్ల దేవత' పుస్తకానికి అవార్డు వరించగా, ప్రసాద్ సూరి రాసిన మైరావణ సాహిత్య యువ అవార్డుకు ఎంపికైంది. ఈ పురస్కారాలు 23 భాషల రచయితలకు అందనుండగా, డోగ్రీ భాషకు ఈ సంవత్సరం యువ పురస్కారం ఇవ్వడం లేదని అకాడమీ తెలిపింది. యువ పురస్కారాల జాబితాలో 23 మంది యువ రచయితల పేర్లను ప్రకటించింది. ఇందులో ఇంగ్లీషు రచయిత అద్వైత్ కొట్టారి, హిందీ కవయిత్రి పార్వతి తిర్కీ కూడా ఉన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ నేతృత్వంలోని కార్యనిర్వాహక మండలి, జ్యూరీ సిఫార్సుల ఆధారంగా రచయితల ఎంపిక జరిగినట్లు సాహిత్య అకాడమీ పేర్కొంది.


బాల సాహిత్య పురస్కారాల రచయితలు

- బాల సాహిత్య పురస్కారాల్లో ఇంగ్లీషులో నితిన్ కుశలప్ప ఎంపి రచించిన 'దక్షిణ్: సౌత్ ఇండియన్ మిత్స్ అండ్ ఫాబ్ లెస్ రీటోల్డ్, హిందీలో సుశీల్ శుక్లా రచించిన 'ఏక్ బేటీ బారా' ఎంపికయ్యాయి.

విజేతలకు ఒక తామ్రపత్రంతో పాటు రూ.50 వేలు అందజేయనున్నారు.

2025 యువ పురస్కార విజేతలు

అస్సామీ - సుప్రకాశ్ భుయాన్
బెంగాలీ - సుదేష్నా మోయిత్రా
బోడో - అమర్ ఖుంగూర్ బోరో
గుజరాతీ -మయూర్ ఖవ్డ
కన్నడ -ఆర్ దిలీప్ కుమార్
కాశ్మీరీ -సైక్వా సెహర్
కొంకణీ - గ్లినిస్ డయాస్
మైథిలీ -నేహా ఝా మణి
మలయాళం -అఖిల్ పి.ధర్మజన్
మణిపురి -ఎకె జితెన్
మరాఠీ - ప్రదీప్ కోకర్
నేపాలీ - సుభాష్‌ఠాకురీ
ఒడియా -సుబ్రత్‌కుమార్ సేనపతి
పంజాబీ -మందీప్ ఔలఖ్
రాజస్థానీ -పూనమ్ చంద్ గోదారా
సంస్కృతం-ధీరజ్ కుమార్ పాండే
సంతాళీ-ఫాగు బాస్కే
సింధీ -మంథన్ బచ్చానీ
తమిళం -లట్షిహార్
ఉర్దూ - నేహా రుబాబ్



బాల సాహిత్య పురస్కార విజేతలు - 2025:

అస్సామీ -సురేంద్ర మోహన్‌దాస్
బెంగాలీ - త్రిదిబ్‌కుమార్ చటర్జీ
బోడో -బినయ్ కుమార్ బ్రహ్మ
డోగ్రీ - పి.ఎల్.పరిహార్ షౌక్
గుజరాతీ -కీర్తిదా బ్రహ్మాభట్ట
కన్నడ - కె.శివలింగప్ప హండిహాల్
కాశ్మీరీ - ఇజ్హార్ ముబాషిర్
కొంకణీ - నయన అడర్కర్
మైథిలీ - మున్ని కమట్
మలయాళం -శ్రీజిత్ మూథేడత్
మణిపురి - శాంటో ఎం
మరాఠీ -సురేశ్ సావంత్
నేపాలీ - సంగ్మ లెప్చా
ఒడియా - రాజకిశోర్ పార్హి
పంజాబీ -పాలి ఖదిమ్ (అమృత్ పాల్‌సింగ్)
రాజస్థానీ - భోగీలాల్ పటీదార్
సంస్కృతం-ప్రీతీ పుజారా
సంతాళీ -హరలాల్ ముర్ము
సింధీ -హీనా అగ్నాని
తమిళం -విష్ణుపురం సర్వణన్
ఉర్దూ - ఘజనఫర్ ఇక్బాల్

8వ వేతన సంఘం సిఫార్సులు

8వ వేతన సంఘానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్ర ఆర్థికశాఖ ద్వారా కోటి మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలు, పెన్షన్లు సవరించనున్నారు. ఈ సవరించిన జీతాల విధానం 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ పెంపుదలపై అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఆంగ్లంలో తొలి డాక్టరేట్ అందుకున్న ట్రాన్స్‌జెండర్ జెన్సీ

'విద్యే మార్గం, మార్పుని తీసుకురాగల సాధనం' అనే నమ్మకంతో ఎన్నో సామాజిక అవమానాలను ఎదుర్కొని, దేశంలోనే ఆంగ్ల భాషలో డాక్టరేట్‌ను పొందిన తొలి ట్రాన్స్‌జెండర్‌గా తమిళనాడుకు చెందిన జెన్సీ ఘనత సాధించారు.

ప్రాక్టీస్ బిట్స్

1. 2026లో భారత జనగణన దేశవ్యాప్తంగా జరిగే ఎన్నో గణన?
(ఎ) 14వది (బి) 15వది
(సి) 16వ (స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వది)
(డి) 17వది
జవాబు : సి

2. జనగణన 2026 తొలి దశ ప్రారంభమయ్యే ప్రాంతం ఏది?
(ఎ) మధ్య భారతం(బి) వాయవ్య భారతం
(సి) హిమాలయ ప్రాంతాలు(డి) దక్షిణ భారతం
జవాబు : సి

3.2026-2027లో జరిగే జనగణనలో ఎంతమంది ఎన్యూమరేటర్లు పాల్గొంటున్నారు?
(ఎ) 25 లక్షలు (బి) 34 లక్షలు
(సి) 35 లక్షలు(డి) 36 లక్షలు
జవాబు : బి

4. భారత్‌లో మొట్టమొదటి వేతన సంఘం ఎప్పుడు ఏర్పాటు చేశారు?
(ఎ) 1946 (బి) 1947
(సి) 1948 (డి) 1950
జవాబు : సి

5.వేతన సంఘం నివేదికను అమలుచేసే సంస్థ పేరేమిటి?
(ఎ) కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ
(బి) కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ
(సి) పబ్లిక్ అఫైర్స్ కమిటీ
(డి) కేంద్ర మానవ వనరులశాఖ
జవాబు : బి

6.మొట్టమొదటి జనగణన ఎప్పుడు జరిగింది?
(ఎ) 1872 (బి)1873 (సి) 1874 (డి) 1875
జవాబు : ఎ

7.జలియన్ వాలాబాగ్ దురంతం ఎప్పుడు జరిగింది?
(ఎ) 1900 (బి)1919 (సి) 1920 (డి) 1921
జవాబు : బి.

8.కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడి పేరు ఏమిటి?
(ఎ) మాధవరావు (బి) సుబ్రహ్మణ్యం (సి) మాధవ్ కౌశిక్ (డి) సురేష్ వర్మ
జవాబు : సి


9.8వ వేతన సంఘం సిఫార్సులు అమలయ్యేది ఎప్పుడు?
(ఎ) జనవరి 1, 2026
(బి) డిసెంబర్ 30, 2025
(సి) జనవరి 1, 2027
(డి) జనవరి 1, 2028
జవాబు : ఎ

10. తెలుగులో గంగిశెట్టి శివకుమార్ రాసిన ఏ పుస్తకం కేంద్ర యువ సాహితీ పురస్కారం-2025కు ఎంపికైంది?
(ఎ) 'దక్షిణ్: సౌత్ ఇండియన్ మిత్స్ అండ్ ఫాబ్ లెస్ రీటోల్డ్ (బి) ఏక్ బేటీ బారా
(సి) మైరావణ (డి) కబుర్ల దేవత
జవాబు : డి



ఇవి గుర్తుపెట్టుకోండి...

- వందేమాతర ఉద్యమం-1905
- ముస్లింలీగ్-1906
- మొదటి ప్రపంచ యుద్ధం-1914-1918
- హోంరూల్ ఉద్యమం-1916
- జలియన్‌వాలాబాగ్ దురంతం-1919
- ఖిలాఫత్ ఉద్యమం-1919
- చౌరీచౌరా సంఘటన-1922
- స్వరాజ్యపార్టీ-1923
- సైమన్ కమిషన్-1927
- ఉప్పుసత్యాగ్రహం-1930
- రెండో ప్రపంచ యుద్ధం-1939-1945
- క్రిప్స్ రాయభారం-1942
- క్విట్ ఇండియా ఉద్యమం-1942






పోటీ పరీక్షల ప్రత్యేకం

వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థుల కోసం అవసరమైన సమాచారంతో ఇకపై ప్రతి సోమవారం ఇక్కడ అందిస్తాం. డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ, ఎస్‌జిటి పేరుతో 'డిఎస్‌సి-2025' అభ్యర్థుల కోసం 35 రోజులపాటు ప్రత్యేక మెటీరియల్‌ను ఇచ్చిన విషయం తెలిసిందే. ఇక నుంచి అన్ని పోటీ పరీక్షల నిమిత్తం 'పోటీ పరీక్షల ప్రత్యేకం' ప్రతి సోమవారం వస్తుంది.

-ఎడిటర్



"శిల్పగతమైన శక్తులు ఎన్ని ఉన్నా -
కవికి ఒక వ్యక్తిత్వాన్ని ఇచ్చేవి
అతడి విశ్వాసాలూ, అభిప్రాయాలే!"

- రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.)



శ్రీమంతుడు

పసిబిడ్డకు పాలిచ్చే మాతృమూర్తిలా
గండశిలలకు కళాజీవం పోసే మహాశిల్పిలా
లేత మొగ్గలకు ప్రాణ పరిమళాలు దిద్దే తోటమాలిలా
అనునిత్యం జ్ఞాన దీక్షలో అతను ...
అనంతకోటి సూర్య కిరణాల్ని మాటల్లో దాచుకొని
ఒక ప్రేమ సముద్రాన్ని మనసంతా నింపుకొని వస్తాడు
సుప్రభాత గీతమై దశదిశలా ప్రతిధ్వనిస్తాడు
విత్తనాల గింజలకు మొలకెత్తడం నేర్పుతూ
జీవితాన్ని గెలిచే తత్వాన్ని నూరిపోస్తూ
అతను కాలాన్ని కరగదీసుకుంటాడు
శ్వాస తీసుకోకుండా బతకలేనట్లే
బోధించకుండా అతను జీవించలేడు
పాఠ్య పుస్తకాన్ని రాజ్యాంగంలా గౌరవించి
దేశ భవిష్యత్తును నిర్మిస్తాడు
గుండె లోతుల్లో చిగురించే ప్రతిభాలతలను
వేయికళ్ళతో శోధించి
సృజనసుమాలను రాసిపోస్తాడు
పూజగది కంటే తరగతి గదే పరమ పవిత్రం అతనికి
గుడిగంట కంటే బడిగంటే అతనికి అమిత ఇష్టం.
చిటారు కొమ్మన మిఠాయి పొట్లంలా
ఊరించడం అతనికి చేతగాదు
బాగా విరగగాసి, కొమ్మల్ని
నేలకు సాచిన మామిడి చెట్టులా
అతను శిష్య సులభుడు!
ఏ ఊరు వెళ్ళినా
ఆకుపచ్చని నదిని అక్కడ సృష్టించి వస్తాడు
అపూర్వ కవనవనాన్ని రచించి
ఆ నేలకు అంకితమిస్తాడు
నీకెంతమంది బిడ్డలని ఎవరైనా అడిగితే
వేలాదిమంది అని పరమానందంగా బదులిస్తాడు
ఈ విశ్వంలో అతని కంటే శ్రీమంతుడెవరున్నారు?

(ఉత్తమ అధ్యాపకుడిగా మూడున్నర దశాబ్దాల పాటు సేవలందించి, ఈరోజు ఉద్యోగ విరమణ చేస్తున్న డాక్టర్ సీతారాం కోసం ...)

- కోయి కోటేశ్వర రావు
9440480274

నది

ఒడ్డున కూచుని చూస్తే
కలను దాచుకోని ఎదలా,
అలకు నోచుకోని ఆ నది
నిశ్చలంగా ...
బడలిక నొందిన మహా వృక్షంలా,
కదలిక ఎరుగని సజీవ చిత్రంలా
నిమ్మళంగా ...

ఆ ఒడిని తాకి చూస్తే
కాంతిని మించిన పరవళ్ళతో,
నిత్య చేతనత్వపు ఆనవాళ్లతో,
బుద్ధుడి నవ్వులా ...
వెన్నెల నావలా ...

- డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.
94408 36931.

చైతన్య సంద్రం 'సిందూరం'


ఇటీవల కాలంలో సిందూరం అన్న పదాన్ని కూడా విద్వేష రాజకీయాల కుట్రలో ఏ మాత్రమూ వెరపు లేకుండా వాడుకోడానికి పూనుకున్నారు. దేశభక్తి, జాతీయత వంటి పదాల లాగే సిందూరం కూడా పెడర్థాల బారిన పడింది. సరిగ్గా ఆ సమయంలోనే వి.వి., ఉష జంట తమ దీర్ఘ కవిత 'సిందూరం' మలి ముద్రణను తెచ్చారు. జూన్ 18న దానిని కామ్రేడ్ బి.వి.రాఘవులు రాష్ట్ర విస్తృత సమావేశంలో ఆవిష్కరించారు.

2018లో వెలువడ్డ 'సిందూరం' మొదటి ముద్రణ వామపక్ష అభ్యుదయ వాదులను, రచయితలను అబ్బురపరిచిందనడంలో సందేహం లేదు. మార్క్స్ రచన క్యాపిటల్‌ను కవితా రూపంలో తేవాలన్న ఆలోచనే ఒక సాహసం అయితే, ఆ ఆలోచనను కార్యరూపంలోకి తీసుకురావడమూ, దానిని ప్రచురించడమూ ఎంత సాహసోపేతమో వేరే చెప్పాలా?

మార్క్స్ తన ఉద్గ్రంథాన్ని విడుదల చేసినప్పుడు అది 19వ శతాబ్దపు పెట్టుబడిదారీ మేధావులకు ఒక పెద్ద షాక్ ఇచ్చింది. అటువంటి ఒక పుస్తకం వెలువడింది అన్నది సమాజానికి తెలియనివ్వకూడదని వాళ్ళు ప్రయత్నించారు. అప్పుడు మార్క్స్, ఎంగెల్స్ వేరే వేరే పేర్లతో ఆ పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఒకసారి, విమర్శిస్తూ మరోసారి, ఇలా వివిధ పత్రికలకు రాస్తూ వచ్చారు. క్రమంగా ఆ గ్రంథం ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోయిన పెట్టుబడిదారీ సమాజం అందులోంచి బైటపడే దారి కనపడక గిలగిల కొట్టుకుంటోంది. ఇప్పుడు ఆర్థికవేత్తలు పరిష్కారం ఏమిటో చెప్పలేక తిప్పలు పడుతున్నారు. క్యాపిటల్ గ్రంథంలో వాళ్ళకేమైనా చిట్కాలు దొరుకుతాయేమోనని వెతుక్కుంటున్నారు. నేటికీ తన ప్రాసంగికతను చెక్కు చెదరకుండా నిలబెట్టుకోడమే గాక, మరింతగా ప్రాధాన్యతను పెంచుకుంది క్యాపిటల్.

అంతటి చేవ గల గ్రంథాన్ని యథాతథంగా అనువదించడమే పెద్ద పని. అంతకన్నా మరో అడుగు ముందుకేసి సరళమైన కవితల రూపంలో అందులోని సారాంశాన్ని అందించాలనుకోవడం మామూలు విషయం కాదు. కాని, దానిని రచయితలు సాధించారు. అందుకు పలు వైపులనుంచి ప్రశంసలు, అభినందనలు సైతం పొందారు. కాని అక్కడితో వారి దాహం తీరలేదు. ఒక శిల్పి తాను చెక్కిన బొమ్మను మరింత సమగ్రంగా, మరింత అందంగా, మరింత గొప్పగా తీర్చిదిద్దడానికి ఎంత తపన పడతాడో, అంతకన్నా ఎక్కువ తపనను తమ మస్తిష్కాలలో జీర్ణించుకున్న వాళ్ళు ఈ దంపతులు. మలి ముద్రణ కోసం వాళ్ళు చేసిన కృషిని చాలా నమ్రతగా రచయితలే వివరించారు గనుక నేనిక్కడ మళ్ళీ ప్రస్తావించను. 75 పేజీల రచన కాస్తా 128 పేజీలైంది. పాఠకులను 18వ శతాబ్దానికి తీసుకెళ్ళి అక్కడి నుంచి మళ్ళీ 21వ శతాబ్దానికి తీసుకొచ్చి ముందు దారి ఏమిటో చూపిస్తుంది ఈ సిందూరం.

పుస్తకం



143 పేజీల ఈ గ్రంథంలో అవసరమైన చోట్ల వివరణలు పొందుపరిచారు, సందర్భోచితంగా కార్టూన్లు జత చేశారు. మార్క్స్ సిద్ధాంతాన్ని హృద్యంగా, ఒక కవితాశిల్పంగా మలిచి మనముందుంచారు.

ఇందులోని కవిత్వపు చేవ ఏమిటో విటపు బాలసుబ్రమణ్యం గారి ముందుమాట వివరించింది. మంచి చిత్రానికి మంచి ట్రైలర్‌లా అది ఉంది. పుస్తకంలోకి పోయేముందు ముందు పేజీలను తప్పకుండా చదవాలి.

తెలుగునాట సిందూరం అన్న పదాన్ని రోజూ వాడరు. ఇక కవితా పిపాసులకు, సాహితీప్రియులకు సిందూరం అనగానే

"సిందూరం, రక్తచందనం,
బంధూకం, సంధ్యారాగం,
పులి చంపిన లేడి నెత్తురూ
ఎగరేసిన ఎర్రని జెండా
రుద్రాలిక నయనజ్వాలిక
కలకత్తా కాళిక నాలిక
కావాలోయ్ నవకవనానికి" అంటూ

మహాకవి శ్రీశ్రీ 'నవ కవిత' శీర్షికన రాసిన కవిత గుర్తుకొస్తుంది. పోస్ట్ మోడర్నిజం శకం భావజాలానికి, హిందూత్వ తిరోగమన భావజాలం తోడై ఉధృతంగా ప్రజల మెదళ్ళలోకి ఇంజెక్ట్ అవుతున్న కాలంలో ఒక హిందీ చిత్రం 'ఓం' అన్నది దేశవ్యాప్తంగా బాగా ఆడింది. దీపిక, షారుఖ్ జంట నటించిన ఆ చిత్రంలో హీరోయిన్ పలికిన ఒక మాట 'ఏక్ చుట్కీ కా సిందూర్' చాలా ప్రచారం పొందింది. తన నుదుట ఒక చిటికెడు సిందూరం పెడితే చాలు; తన జన్మ తరించినట్టేనంటూ హీరోయిన్ ప్రాధేయపడుతుంది. ఆ కోరిక నెరవేరక ఆత్మగా మారిపోతుంది. పచ్చి తిరోగమన భావాలను ప్రబోధించిన ఆ చిత్రంలో సిందూరం అన్న పదం వాడడం వ్యూహాత్మకం. భారతీయ స్త్రీలు, ముఖ్యంగా ఉత్తరాది వారు నుదుట సిందూరం దాల్చితే వారు వివాహితలని, ముత్తైదువలని గుర్తింపు. ఆ సెంటిమెంటుని సినిమాలో బాగా వాడుకుని సొమ్ము చేసుకున్నారు. దానినే తమ రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకుని ఎన్నికల్లో సొమ్ము చేసుకోడానికి మోడీ అండ్ కో 'ఆపరేషన్ సిందూర్' పేరుతో వాడుకోడానికి పూనుకున్నారు. ఇక్కడ రాజకీయాల్లో గాని, అక్కడ సినిమాలో గాని సిందూరం పురుషాధిక్యతకు సంకేతమే తప్ప వేరే విలువ లేదు.

కాని నవ కవితలో శ్రీశ్రీ ప్రస్తావించిన సిందూరం సూచించేది వేరు. అది చైతన్యానికి ప్రతీక. సమాజంలోని దోపిడీని సమూలంగా నిర్మూలించి మానవత్వ విలువలను పరిమళింపజేసే సమ సమాజం నిర్మించడం కోసం దీక్ష పూనేవారి సంకల్పానికి సిందూరం ఒక సంకేతం.

వివి, ఉష రెండో ముద్రణ టైమింగ్‌ను గమనిస్తే – అది ఎంత బాగా కుదిరిందో బోధపడుతుంది. మోడీ, షాల 'ఆపరేషన్" మాదిరిగా కాకుండా, విస్తృత శ్రామిక జనావళి ఈ సమాజం మీద నిర్వహించబోయే 'ఆపరేషన్' ఈ సిందూరం. ఆపరేషన్ చేయాల్సిన సర్జన్లు కష్టజీవులు. వారికి అందుకు కావలసిన అవగాహన కల్పించడమే ఈ కవిత లక్ష్యం.

నేడు రాష్ట్రాన్ని పాలిస్తున్న చంద్రబాబు 'పెట్టుబడిదారులే సంపద సృష్టికర్తలు' అంటూ పచ్చి అబద్ధాన్ని పదే పదే జపిస్తున్నాడు. యోగాసనాలు వేయించి మరీ జనాల బుర్రల్లోకి ఎక్కించాలని చూస్తున్నాడు. ఈ పాలక కూటమి ప్రచార బుడగను టప్పున పేల్చివేసే సాధనం సిందూరం కవిత. రచయితలు చంద్రబాబుకి ఏం చెప్తున్నారో చూడండి:

"పదే పదే గుర్తు పెట్టుకో
'శ్రమ' చినుకులు పడితేనే
'సిరి' కాలం చిగురిస్తుంది
రైతు జలం ప్రవహిస్తేనే
పచ్చ'ధనం' పండుతుంది
పని స్వేదం తగిలితేనే
సంపద ఎద చిందేస్తుంది"

సమస్త సంపదకూ మూలం మానవ శ్రమ అన్న ప్రాథమిక ఆర్థిక సూత్రాన్ని ఇక్కడ రచయితలు గుర్తు చేస్తున్నారు. నేటి తరానికి దీనిని గుర్తు చేయడం చాలా అవసరం.

ఎందుకంటే నేటి నయా ఉదారవాద సమాజంలో మనిషి శ్రమకు విలువ లేకుండా పోయింది. ఏం చేసి సంపాదించాం అన్నది కాదు ముఖ్యం, ఎంత సంపాదించాం అన్నదే ముఖ్యం అయిపోయింది. ఒకపక్క లక్షల కోట్లలో సంపదను పోగేస్తున్నవారు, మరోపక్క అంతకంతకూ నిరు పేదరికంలోకి దిగజారిపోతున్నవారు ఉన్నారు. వారి నడుమ అంతరాలూ పెరిగిపోతూనే వున్నాయి. దీనికి కారణం ఏమిటి?

"బతుకు మేర కూలి లెక్కగట్టి
శ్రమ విలువ వాటా ఎగ్గొట్టి
దొరలు దోచి దాచిన మిగులే
దోచేత పెట్టుబడి" అంటూ అదనపు విలువ

సిద్ధాంతపు సారాన్ని సూటిగా ప్రకటించారు రచయితలు. ఈ పచ్చి నిజాన్ని కప్పెట్టి ధనవంతులు కొందరు పేదల్ని దత్తత తీసుకుని ఉద్ధరిస్తే సరిపోతుందని, పేదరికం అంతరిస్తుందని చంద్రబాబు ప్రచారం చేస్తున్నాడు. అన్ని మేకల్నీ ఎడాపెడా తినేయకుండా కొన్నింటినైనా సాకి పెంచితే తర్వాత తర్వాత ఇబ్బంది ఉండదని సింహాలకి సలహా ఇస్తున్నాడు. పేదరికానికి కారణమే పెత్తందారుల దోపిడీ. దానిని నిర్మూలిస్తే తప్ప పేదరికం పోదు. కాని ఆ సత్యాన్ని ప్రజలు గ్రహించకుండా కప్పిపుచ్చడానికి పాలకులు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు ఎత్తుతూనే వుంటారు. ఆ ఎత్తుల బండారాన్ని సిందూరం బైటపెడుతోంది.

"నష్టజీవీ! భ్రష్టజీవీ! కష్టజీవీ!
పెట్టుబడిదారులు కట్టగట్టుకుని
రక్తం పిండుతుంటే లేని భయం
నీ రాజ్యం సాధించేటప్పుడు" ఎందుకు? అని

రచయితలు ప్రశ్నిస్తున్నారు.

"నడువ్ నడువ్, విడువ్ భయం...
సమతారాజ్యం సాధించేవరకూ
విరామమెంచకూ విశ్రమించకూ" అంటూ

కష్టజీవుల నుదుటన చైతన్య సిందూరాన్ని అద్దుతున్నారు. వారి పిలుపును అందుకుని ముందడుగేయడమే మనందరి కర్తవ్యం. భావజాల రంగంలో వర్గపోరాటం ప్రాధాన్యత చాలా ఎక్కువగా ఉన్న ప్రస్తుత కాలంలో వివి, ఉష చేసిన ఈ గొప్ప ప్రయత్నం సాహిత్యపరంగా, సిద్ధాంతపరంగా చిరకాలం నిలిచిపోతుంది. వారికి మరోసారి అభినందనలు.

- ఎం.వి.ఎస్.శర్మ

ప్రజాశక్తి సాహితీసంస్థ
రచనల పోటీ - 2025 ఫలితాలు

ప్రజాశక్తి సాహితీసంస్థ రచనల పోటీ - 2025 కి రచయితలు, రచయిత్రుల నుంచి మంచి స్పందన వచ్చింది. మేము ఆహ్వానించగానే కథలూ, పాటలూ పంపి, పోటీని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు. కథా ప్రక్రియకు సుమారు 300 కథలు వచ్చాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మొత్తం 25 కథలను సంకలనం కోసం ఎంపిక చేయడం జరిగింది. ఈ కథలను ప్రజాశక్తి దినపత్రిక ఆదివారం అనుబంధం 'స్నేహ'లోనూ, 'సాహిత్య ప్రస్థానం' మాసపత్రికలోనూ ప్రచురించడం జరుగుతుంది. ఈ కథల ఎంపికకు డా॥ ఎం.ప్రగతి, చీకటి దివాకర్, కెంగార మోహన్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పాటల ప్రక్రియకు సుమారు 200 పాటలు వచ్చాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 57 పాటలను సంకలనం కోసం ఎంపిక చేయడం జరిగింది. పాటల ఎంపికకు న్యాయనిర్ణేతలుగా ప్రముఖ గాయకుడు, దర్శకుడు, నంది అవార్డు గ్రహీత కవి పిఎన్ఎం, ప్రజానాట్యమండలి కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఎంపికైన కథలూ, పాటలతో పుస్తకాలు వెలువరిస్తాము.

బహుమతి పొందిన కథలు

1. దప్పు	(ప్రథమ)	రూ. 10,000	- శింగరాజు శ్రీనివాసరావు
2. రాకాసి గీతలు	(ద్వితీయ)	రూ. 5000	- హరి వెంకటరమణ
3. శుభ పరిణామం	(తృతీయ)	రూ. 3000	- బి.ఎల్.గాయత్రి

బహుమతి పొందిన పాటలు

1. మేడే గీతం	(ప్రథమ)	రూ. 5000	- కె.ఆనందాచారి
2. ఆరని పోరాట జ్వాల	(ద్వితీయ)	రూ. 3000	- టి.పావెల్
3. అక్షరానికి విజ్ఞాపన	(తృతీయ)	రూ. 2000	- ఇమంది అశోక్ కుమార్

బహుమతుల ప్రదానం, కథలు, పాటల సంకలనాల ఆవిష్కరణ సభ జులై నెల చివరి వారంలో విజయవాడలో ఉంటుంది. సభా కార్యక్రమ తేదీ వివరాలు త్వరలో తెలియజేస్తాము. ఈ రచనల పోటీకి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

- వి. కృష్ణయ్య, ఛైర్మన్
ఎం.వి.ఎస్. శర్మ, ప్రధాన కార్యదర్శి, ప్రజాశక్తి సాహితీ సంస్థ

సమాచారం కోసం : 94900 99059


సంకలనం కోసం ఎంపికైన కథలు

క్రసం	కథపేరు	రచయిత
1.	దప్పు (ప్రథమ బహుమతి)	శింగరాజు శ్రీనివాసరావు
2.	రాకాసి గీతలు (ద్వితీయ బహుమతి)	హరి వెంకటరమణ
3.	శుభ పరిణామం (తృతీయ బహుమతి)	బి.ఎల్.గాయత్రి
4.	అర్బన్ గీతం	ఎం.డి.అబ్దుల్లా
5.	నల్లమల్లె చెట్టు	గౌతమ్ లింగా
6.	లౌక్యం	ఎం.విజయశ్రీముఖి
7.	మే 'స్త్రీ'	జె.శ్యామల
8.	జల విలాపం	ఎల్.శాంతి
9.	శారా... ది గ్రేట్..!	గంగవరపు సునీత
10.	ఆ చేత్తో ఇచ్చి ...	సంఘమిత్ర
11.	తిరుగుబాటు ఓ అభ్యాసం!	పి.చంద్రశేఖర్ ఆజాద్
12.	చేదు తీపి!	సడ్లపల్లె చిదంబరరెడ్డి
13.	వీధికుక్క	వసుంధర
14.	ఏడు రంగుల ఆకాశం	శైలజామిత్ర
15.	ప్రేమామృతం	కె.ఉషారాణి
16.	విత్తనాలు	మాకినీడి సూర్యభాస్కర్
17.	పుట్టని కొడుక్కు దాయాది వాటా	వంకిరెడ్డి రెడ్డెప్ప రెడ్డి
18.	మూర్ఖత్వం	పి.రాజ్యలక్ష్మి
19.	రెండేళ్ళ కష్టం	మొలకలపల్లి కోటేశ్వరరావు
20.	వెలుగు గుమ్మంలోకి ...	సింహాద్రి నాగశిరీష
21.	గిట్టుబాటు	వై.కె.సంధ్యాశర్మ
22.	దత్తత	డాక్టర్ ఐజక్ గుండె
23.	సమ్మయ్య, మరికొందరు	కావూరి శారద
24.	ఏ దేశ చరిత్ర చూసినా ...	పాలపర్తి జ్యోతి
25.	సర్కారు బడి	తన్నీరు శశికళ

సంకలనం కోసం ఎంపికైన పాటలు

క్రసం	పాట పేరు	రచయిత
1.	మేడే గీతం (ప్రథమ బహుమతి)	కె.ఆనందాచారి
2.	ఆరని పోరాట జ్వాల (ద్వితీయ బహుమతి)	టి.పావెల్
3.	అక్షరానికి విజ్ఞాపన (తృతీయ బహుమతి)	ఇమంది అశోక్ కుమార్
4.	చినుకు చినుకు పడితేనే	చెళ్ళపిళ్ల శ్యామల
5.	పతనమైపోతున్నడమ్మా	సిహెచ్.చిన సూర్యనారాయణ
6.	డమ డమ డమ డమ డప్పుల మోతరా	బాదరాల ఆంజనేయులు
7.	ఆడదంటే అబలా కాదు!	ఎండి నజీబ్
8.	ఎక్కడుంది లోపం?	బి.రవీంద్రాచారి
9.	జనం కదిలితే జాతర	బండారి రాజ్‌కుమార్
10.	ఇదేగా పాటంటే ...	వారణాసి నాగలక్ష్మి
11.	తెలుగు వెలుగు	కామేశ్వరి మొక్కరాల
12.	మనిషి ఓ మనిషి	రాచమల్లు మోజెస్
13.	వలస కూలీలం..!	జి. సూర్యనారాయణ
14.	ఎక్కడ ఉన్నాడో మనిషి	శ్రీదర్శి
15	జయహో కార్మికా ...	అల్లాడి శ్రీనివాస్
16.	శ్రామిక శక్తి!	కె.హెచ్.చిదంబరరెడ్డి
17.	కలము చేత బట్టి	డా॥ బొక్కా శ్రీనివాసరావు
18.	శ్రమలో ఉన్నది ప్రపంచ ప్రగతి	కుడికాల వంశీధర్
19.	రంగుల వల	డి.సూరిబాబు
20.	దారి దీపమైన జెండా	సంపటం దుర్గాప్రసాదరావు
21.	అమ్మ లాంటి చెట్టును	లోగిశ లక్ష్మీనాయుడు
22.	జన కవనం!	ఎరుకలపూడి గోపీనాథ్‌రావు
23.	పట్నం పోకడ, అక్కడి రగడ	బల్లా విజయకుమార్
24.	ఆట - పాట	సింహాద్రి నాగశిరీష
25.	మగువ తోడు లేకుంటే	పోతగాని సత్యనారాయణ
26.	అమ్మంటే ...	వి.వి.కుమార్
27.	కళ తప్పిపోతున్న కళలు	వాడాడ చంద్రశేఖర్
28.	మేలుకోరా... మేలుకోరా	బి.వి.పద్మరాజు
29.	స్పందించే మనసుకు...	బి. దశరథ రామారావు
30.	ఏలేటోడ ఏడబోతివో ...	వినోద్ కుత్తుల
31.	ఏమైపోతుందీ దేశం...	బిక్కనూరి రాజేశ్వర్
32.	దేశమంటే మతం కాదు	గాజోజు నాగభూషణం
33.	శ్రమ సౌందర్యం	నమిలకొండ సునీత
34.	జనము జనము జనమూ ...	అల్వకంటే వెంకట రమణమూర్తి
35.	వలస బతుకు	బి.గోవర్ధనరావు
36.	తరువును నేను	పి.వి.పద్మిని
37.	ప్రభంజనమై సాగాలని మేడే!	దేరంగుల భైరవ
38.	ఏది మతం ఏది కులం?	బి.వి.శివప్రసాద్
39.	పతాకమా!	అరవింద
40.	మేడే గీతం (కార్మిక హక్కుల మేడే)	వెన్నెల సత్యం
41.	మనుషులు మారాలి	కెఎన్నార్ నమ్మి
42.	నాయన ఊరికి పోవాలి	శింగరాజు శ్రీనివాసరావు
43.	కార్మిక సోదరా ...	కాదంబరి శ్రీనివాసరావు
44.	దాడి జరుగుతు ఉందిరో ...	గడ్డం జయరావు
45.	శ్రమజీవులం	రాజ్ తొర్లపాటి
46.	కార్మికులు - కర్షకులు	గజ్జెల రాజేశం
47.	కాలం ముల్లుపై ...	ఎం.డి.అబ్దుల్లా
48.	ఓటు వేద్దాం	ఆచంట సుధాకళ్యాణి
49.	వాచ్‌మానునండీ నేను...	కోరుకొండ వెంకటేశ్వరరావు
50.	నేలపై నిలబడడం నేర్చుకో	ఐలేని గిరి
51.	నీ తూరుపు ఎరుపెక్కనిదే ...	చిట్టేల శ్రీధర్ కుమార్
52.	బాల్యం - బానిసత్వం	కుమార్ నాగేంద్ర
53.	పచ్చని చెట్టుపై పచ్చివై ఎగిరినౌ	చిట్ల ప్రేమ్‌కుమార్
54.	క్రమంగా లేచిన చేతులు	మోహిత కౌండిన్య
55.	వలస బతుకు	బి.గోవర్ధనరావు
56.	కదలి రండి.. కదలి రండి ...	పి.జయశ్రీ
57.	మన పయనం ఎటువైపు	కుప్పిలి వెంకట రాజారావు

దిగవల్లి శివరావు విస్మృత సాహిత్య కృషి



దిగవల్లి వెంకట శివరావు గట్టి చరిత్ర పరిశోధన చేసిన వ్యక్తి, దేశభక్తులు, రాణించిన న్యాయవాది, పాండిత్యం గల సాహిత్యవేత్త, ఉభయభాషలెరిగిన పాత్రికేయులు, అనువాదకులు, రాజకీయ నాయకులు. ఆయన 'జ్ఞాపకాలు అభిప్రాయాలు' అన్న శీర్షికతో రాసుకున్న రాతప్రతుల బొత్తులలోంచి 'విన్నంత, కన్నంత, తెలిసినంత' అనే పేరుతో మూడు భాగాలుగా శివరావు కుమారుడు డా.రామచంద్ర ఇటీవల కాలంలో వెలువరించారు.

బ్రిటీష్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగమున్న కుటుంబంలో 1898 ఫిబ్రవరి 14న శివరావు జన్మించినా తన పదవ ఏటనే తండ్రిని కోల్పోవడంతో బావ బొడ్డపాటి పూర్ణయ్య తోడ్పాటుతో కాలికట్, బెంగళూరు, రాజమండ్రి, మద్రాసులలో చదువు పూర్తి చేసి న్యాయవాదయ్యారు. దిగవల్లి శివరావు మద్రాసులో విద్యార్థిగా ఉన్నప్పుడు 1916లో చేసిన తొలి రచన 'హత్యాఛాయ' నార్వేజియన్ నవల ఆధారంగా రచించిన జమీందారుల కథ. ఇది 1929లో 'నీలాపనింద'గా ప్రచురితమైంది. 1922లో బెజవాడ నుంచి తన న్యాయవాది వృత్తిని ప్రారంభించడంతో ప్రజాజీవితం, సాహిత్య కృషి, చరిత్ర పరిశోధన ఉవ్వెత్తున కొనసాగింది. ఆ మరుసటి సంవత్సరం ప్రకాశం పంతులు కోరిక మేర తన 'స్వరాజ్య' ఆంగ్ల దినపత్రికలో స్పెషల్ కరస్పాండెంట్‌గా చేరారు. 'పోతన వేమనల యుగము' పుస్తకం 1924లో వెలువడగా– గాంధీజీ సాగించిన సత్యాగ్రహ పోరాటం సంబంధించి 'దక్షిణాఫ్రికా' పేరున 1928లో గ్రంథం వచ్చింది. దీనిని గాంధీజీకి అంకితమివ్వడం విశేషం. అమెరికా దేశపు నీగ్రో బానిసల ఘోరస్థితిని లోకానికి వెల్లడించి, బానిసత్వం రూపుమాపడానికి తోడ్పడిన 'అంకుల్ టామ్స్ క్యాబిన్' అనే సుప్రసిద్ధ ఆంగ్ల నవలను తెలుగు అనువాదం చేశారు.

1966 అక్టోబర్ 10వ తేదీన ('ఆంధ్రజ్యోతి') దినపత్రికలో కాకాని వెంకటరత్నం రాసిన వ్యాసంలో, విజయవాడ కేంద్రంగా దిగవల్లి వెంకట శివరావు ఆనాటి తెలుగు ప్రాంతపు స్వాతంత్ర్య పోరాట యోధులకు ఏ విధంగా, పైకి కనబడకుండా ఎలా ఊతంగా నిలిచారో వివరించారు. సత్యాగ్రహ చరిత్ర, నిర్భాగ్య భారతం, దరిద్ర నారాయణీయం, విదేశీ వస్తు బహిష్కారం, బ్రిటిష్ వస్తు బహిష్కారం, బార్డోలి సత్యాగ్రహం, సత్యాగ్రహ బోధిని, దేశభక్తి గీతాలు, పాటలు, పద్యాలతో కూడిన 'పాంచజన్యం', 'ఆంధ్ర పౌరుషం' మొదలైన పుస్తకాలను దిగవల్లి శివరావు 1930లో ప్రచురించారు. బ్రిటీష్ పాలనలోని ఘోరాలు, గాంధీజీ తలపెట్టిన సహాయ నిరాకరణ సత్యాగ్రహ ఉద్యమం నిర్మాణం కార్యక్రమాలకు సంబంధించి అప్పటివరకు తెలుగులో సరైన పుస్తకాలు రాలేదు. శివరావు రాసిన పుస్తకాలు చదివి కాంగ్రెస్ నాయకులు ఉపన్యాసాలు చేస్తే ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక వాటిని వార్తలుగా ప్రచురించేవి. పశ్చిమ కృష్ణా జిల్లా జాతీయ సంఘం ఈ పుస్తకాలను వేల ప్రతులుగా ముద్రించి అణా ఖరీదుకు అమ్మేవారు, కార్యకర్తలకు ఉచితంగా ఇచ్చేవారు. దీనిని చూసి పశ్చిమ, తూర్పు గోదావరి ప్రాంతాలు; గుంటూరు ప్రాంతపు కాంగ్రెస్ సంఘాలు కూడా ఇటువంటి రచనలు ప్రచురించి ప్రచారం చేశారు. 1930–32 మధ్యకాలంలో బసవరాజు వెంకట అప్పారావు వంటి యువకులను ప్రేరేపించి, వారితో పాటలు రాయించి పుస్తకంగా ప్రచురించడంతో బ్రిటిష్ పాలకుల కంటబడి రాజ ద్రోహం అభియోగం శివరావు మీద మోపబడింది.

ఆచార్య ఎన్.జి.రంగా నిడుబ్రోలులో నిర్వహించిన రైతు పాఠశాలలో దిగవల్లి శివరావు రాసిన పుస్తకాలను టెక్స్ట్ పుస్తకాలుగా నిర్దేశించడమే కాకుండా, శివరావును ఉపన్యాసాలు ఇవ్వడానికి ఆహ్వానించారు కూడా. 'ఆంధ్ర పత్రిక' పాఠకులకు 'కథలు గాథలు' శీర్షిక ద్వారా శివరావు చేసిన రచనలు 1944లో గ్రంథరూపం ధరించాయి. 1943 డిసెంబర్ 27న ఆంధ్ర పత్రిక సంస్థ యజమాని, సంపాదకులు శంభు ప్రసాద్ ఉత్తరం రాస్తూ వీరి వ్యాసాలు ఆదరణ పాత్రంగా ఉన్నాయని, వారి దగ్గర ఉన్న వ్యాసాలన్నీ పంపమని ప్రచురించగలమని కోరారు. తర్వాతి దశలో నార్ల వేంకటేశ్వరరావు సైతం శివరావు పట్ల విశేషమైన గౌరవంతో ఆయన రాసిన వ్యాసాలను తన పత్రికల్లో ప్రకటించారు. 'అధినివేశ స్వరాజ్యము' క్రౌన్ సైజులో 230 ఫోటోలున్న గ్రంథం. ఇంగ్లాండు, కెనడా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ రాజ్యాంగాలు; అవి స్వరాజ్యం పొందే నాటికి వాటి స్థితిగతులు, భారతదేశ ప్రజలకు గల స్వరాజ్యార్హత, ఫెడరల్ రాజ్యాంగ విధానం, ప్రమాణ ప్రాతినిధ్యం, ప్రజా ప్రభుత్వం, ఫెడరల్ విధానం వంటి విషయాలను వివరించిన ఈ గ్రంథంపై 'ఆంధ్రపత్రిక' సంపాదకీయమే రాసి ప్రశంసించింది. మిగతా రచనలను పరిశీలిస్తే – అవి ఇలా ఉన్నాయి : ఆంగ్ల రాజ్యాంగము, సహకార వస్తు నిలయోద్యమము, భారతదేశ స్థితిగతులు (వివిధ దేశముల స్థితి గతి లెక్కలు ... స్టాటిస్టిక్స్), నూతన ఇండియా రాజ్యాంగము, ఫెడరేషన్ నిజస్వరూపం, బ్రిటిష్ ఇండియా చరిత్ర, భారత దేశమున బ్రిటిష్ రాజ్య తంత్రము ఇంకా The British rule in India. ఇది మొదట 1937లో ఇంగ్లీషులో, తర్వాత తెలుగులో వెలువడిన గ్రంథం. ఈ రెండూ కలిపి 820 పుటలతో ఒకే సంపుటిగా వెలువడింది.

స్వాతంత్ర్య పోరాటం, దానికి దోహదపడే న్యాయవాద సామర్థ్యం, ఈ రెండింటిని అనుసంధానించే రీతిలో సాగిన జర్నలిజం, ఈ మూడింటిని కలగలిపి సమాజానికి అవసరమైన పద్ధతిలో చేసిన రచన... ఎంత అద్భుతమైన మేళవింపు? ఏకకాలంలో పలు రంగాల్లో గొప్పగా కృషి చేయడం కచ్చితంగా పరిమితి కానే కాదు. ఆ స్ఫూర్తిని అందుకోవడం, దాన్ని దాచుకోవడం మన బాధ్యత. 1992 అక్టోబర్ 3న గతించిన దిగవల్లి వెంకట శివరావు జీవితాన్ని, క్రమబద్ధమైన కృషిని క్లుప్తంగా, సమగ్రంగా చెప్పే మోనోగ్రాఫ్ తక్షణ అవసరమని అనిపిస్తోంది.

- డా. నాగసూరి వేణుగోపాల్,
94407 32392

తేజస్వీ యాదవ్‌పైకి డ్రోన్

- తృటిలో తప్పిన ముప్పు

పాట్నా : బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆర్‌జెడి నాయకులు తేజస్వి యాదవ్‌కు ఆదివారం పెను ముప్పు తప్పింది. ఆయనను లక్ష్యంగా చేసుకొని ఒక డ్రోన్ దూసుకురావడం కలకలం రేపింది. పాట్నాలోని చారిత్రాత్మక గాంధీ మైదానంలో ఆదివారం 'సేవ్ వక్ఫ్, సేవ్ కానిస్టిట్యూషన్' పేరుతో నిర్వహించిన సభలో తేజస్వీ యాదవ్ ప్రసంగిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆయన మాట్లాడుతుండగా...వేగంగా దూసుకొచ్చిన డ్రోన్ అక్కడున్న మైక్‌ను ఢీ కొని పక్కకు వెళ్లిపోయింది. క్షణకాలంలో ఇది జరిగింది. ఈ ఘటనతో అక్కడ ఉన్న వారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటన గురించి పాట్నా ఎస్‌పి (సెంట్రల్) దీక్ష మీడియాతో మాట్లాడుతూ 'ఈ సంఘటనను మేం పరిశీలిస్తున్నాం. నిజానికి ఇది నిషేధిత ప్రాంతం. అలాంటి డ్రోన్ అక్కడకి రాకూడదు. ఈ ఘటన జరుగుతున్నప్పుడు ర్యాలీకి హాజరైన జనసమూహాన్ని నియంత్రించడంలో పోలీసు బృందం బిజీగా ఉంది. ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు నిర్వహిస్తాం' అని తెలిపారు.

మైనారిటీలపై విషం చిమ్ముతున్న సంఘ్ పరివార్

- ఏడాది కాలంలో మరింత పెరిగిన మతోన్మాద ఘటనలు
- పదేపదే విద్వేషం వెళ్లగక్కుతున్న బిజెపి నేతలు
- బయటపెట్టిన ఎపిసిఆర్ నివేదిక



న్యూఢిల్లీ : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటికే ఏడాది పాలన పూర్తి చేసుకున్నారు. గత సంవత్సర కాలంలో దేశంలో మైనారిటీలకు వ్యతిరేకంగా అనేక నేరాలు జరిగాయి. ఇక విద్వేష ప్రసంగాలకు అంతే లేదు. బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏకంగా 63 ప్రసంగాలలో మైనారిటీలు...ముఖ్యంగా ముస్లింలపై విషం కక్కారు. ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు సైతం 71 విద్వేష ప్రసంగాలు చేశారు. గత సంవత్సర కాలంలో ముస్లింలు, దళితులు, ఆదివాసీలు, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకొని ఓ పద్ధతి ప్రకారం ప్రతీకార దాడులు జరిగాయని పౌర హక్కుల పరిరక్షణ సంఘం (ఎపిసిఆర్) ఓ నివేదికలో తెలిపింది. ఆ వివరాలు..

- నరేంద్ర మోడీ మూడోసారి అధికారాన్ని చేపట్టిన తర్వాత సంవత్సర కాలంలో దేశంలో 947 ద్వేషపూరిత నేర ఘటనలు జరిగాయి. వీటిలో 345 విద్వేష ప్రసంగాలకు సంబంధించినవి కాగా మిగిలిన 602 నేరాలు. ఈ ద్వేషపూరిత నేరాలలో 173 ఘటనలు మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని జరిపిన భౌతిక దాడులకు సంబంధించినవి. ఈ సంఘటనల్లో 25 మంది మైనార్టీలు ప్రాణాలు కోల్పోయారు. విద్వేష ప్రసంగాల విషయానికి వస్తే బిజెపితో సంబంధమున్న 178 మంది ఆ ప్రసంగాలు చేశారని నివేదిక తెలియజేసింది.
- దేశంలో ప్రతి నెలలోనూ కనీసం 80 వరకూ ద్వేషపూరిత నేరాలు నమోదయ్యాయి. గత సంవత్సరం అక్టోబర్‌లోనూ, ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ ఈ తరహా నేరాల సంఖ్య బాగా ఎక్కువగా ఉంది.
- ఇదేకాలంలో ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 21 విద్వేష నేరాల కేసులు నమోదు కాగా మధ్యప్రదేశ్‌లో 16, మహారాష్ట్రలో 11 వచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లో ముస్లిం యువతను నవరాత్రి వేడుకలలో పాల్గొనకుండా నిరోధించిన ఘటనలు వెలుగు చూశాయి. పాస్టర్లను బెదిరించడం, అరెస్ట్ చేయడం జరుగుతోంది. పర్వదినాల మాటున...ఈ ఏడాది ఏప్రిల్‌లో 96 నేరాలు నమోదయ్యాయి. వీటిలో ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 27 ఘటనలు జరిగాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలోనూ అనేక ప్రాంతాల్లో ఇదే తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి.
- దేశంలో విద్వేష ప్రసంగాలు, నేరాలు పెచ్చరిల్లుతున్నప్పటికీ పోలీసులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గత సంవత్సర కాలంలో 602 ద్వేషపూరిత నేరాలు జరిగితే వాటిలో కేవలం 13 శాతం నేరాల పైనే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. హిందూత్వ శక్తులకు కొమ్ముకాస్తున్న మీడియా అగ్నికి ఆజ్యం పోస్తూ మత విద్వేషాలను రెచ్చగొడుతోంది.
- మహారాష్ట్రకు చెందిన నితేష్ రాణే వంటి నేతలు ఓ వ్యూహం ప్రకారం మసీదులలోకి ప్రవేశించి ముస్లింలను ఒక్కొక్కరిగా చంపేస్తామని బెదిరించారు. ముస్లింలకు వ్యతిరేకంగా పని చేసే వారికి మద్దతు ఇస్తానని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ బహిరంగంగానే ప్రకటించారు. గత సంవత్సర కాలంలో నమోదైన 345 విద్వేష ప్రసంగాలలో బిజెపికి చెందిన వారివే 109 ఉండడం గమనార్హం. చట్టసభలకు ఎన్నికైన వారిలో 139 మంది ద్వేషపూరిత ప్రసంగాలు చేశారు. ఇదే సంస్థ నివేదిక ప్రకారం..గతేడాది నమోదైన 345 విద్వేష ప్రసంగాలలో బిజెపి 178 ప్రసంగాలతో అగ్ర స్థానంలో నిలవగా విహెచ్‌పి నేతలు 21, బజరంగ్‌దళ్ నేతలు 20 ప్రసంగాలు చేశారు.

ఎస్ఎఫ్ఐ కేంద్ర కార్యనిర్వాహక కమిటీ ఇదే..

కోజికోడ్ : భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) కేంద్ర కార్యనిర్వాహక కమిటీని 18వ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కమిటీకి ఎన్నికైనవారు..రాష్ట్రాలవారిగా అక్షరక్రమంలో..ఆంధ్రప్రదేశ్ నుంచి కె ప్రసన్న కుమార్, పి రామ్మోహన్, ఓ పరమేష్, పల్లవి, సాహిదా ఎన్నికయ్యారు. బీహార్ నుంచి కాంతికుమారి, ఢిల్లీ నుంచి ఐషే ఘోష్, సూరజ్ ఎలమోన్, గుజరాత్ నుంచి సత్యేష్ లేయువా, అగ్మాన్ లేయువా ఎన్నికయ్యారు. అలాగే హర్యానా నుంచి సుఖ్‌దేవ్ బూరా, అక్షయ్ మహ్లా, విజయ్ కుమార్ ఠాకూర్, సస్నీత ఎన్నిక కాగా కర్ణాటక నుంచి అనిల్ ఠాకూర్ సుజాత ఎన్నికయ్యారు. కేరళ నుంచి పిఎస్ సంజీవ్, ఎం శివప్రసాద్, ఎస్ కె ఆదర్శ్, బిబిన్‌రాజ్ పాయం, సంద్ర రవీంద్రన్, పి తాజుదీన్, గోపిక, టోనీ కురియాకోస్, ఆర్య ప్రసాద్, అక్షర ఎన్నికయ్యారు. ఇక మధ్యప్రదేశ్ నుంచి అజయ్ తివారీ, రాజ్‌వీర్ ధాకడ్, ఒడిశా నుంచి రోహిదాస్ చంద్‌రామల్ జాదవ్, సో మణిశత్రామల్ జాదవ్, పుదుచ్చేరి నుంచి ఎస్ ప్రవీణ్ కుమార్, రాందాస్ పి శ్రీనివాసన్ ఎన్నిక కాగా పంజాబ్ నుంచి జీవన్ కుమార్ ఎన్నికయ్యారు. రాజస్థాన్ నుంచి విజేంద్ర ఢాకా, ముఖేష్ మోహన్ పురియా, ఫల్గుణ్ బరందా, ప్రియా చౌదరి, తమిళనాడు నుంచి జి అరవింద సామి, టి షమ్‌సీర్ అహ్మద్, సి మృదుల, కెపి సౌమ్య, అలాగే త్రిపుర నుంచి టి నాగరాజు, ఎస్ రజనీకాంత్, ఎం మమత, ఎం పూజ, కె శంకర్, ఎమ్‌డి అతిక్ దేవ్, సృజన్ అతీక్ అహ్మద్ దేవ్, పూజా హరిదాస్, సుజిత్ త్రిపుర, దీప్షన దెబ్బర్మ ఎన్నికయ్యారు. ఉత్తరాఖండ్ నుంచి నితిన్ మలేటా, శైలేంద్ర పర్మార్, ఉత్తరప్రదేశ్ నుంచి పార్థసారథి ద్వివేది, అబ్దుల్ వహాబ్ ఎన్నికయ్యారు. ఇక పశ్చిమ బెంగాల్ నుంచి దేబంజన్ దే, ప్రణయ్ ఖర్జీ, సౌవిక్‌దాస్ బక్షి, ఆకాష్ కర్, మధుశ్రీ ముహూపానా, దిష్టి మజుమ్ షువాజిత్ సర్కార్, జాకీర్ హుస్సేన్ ముల్లిక్, అర్నాబ్ దాస్ ఎన్నికయ్యారు. అఖిల భారత కేంద్రం నుంచి సృజన్ భట్టాచార్య, ఆదర్శ్ ఎం సాజి, సుభాష్ జాకర్, ఎంఎల్ అభిజిత్, దొడ్డా బసవరాజ్ గులేడ, కేంద్ర విశ్వవిద్యాలయాల నుంచి శిల్పా సురేంద్రన్, వైద్య విద్యా రంగం నుంచి దీపాజిత్ దాస్, కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వాన సభ్యులుగా ఐర్లండ్‌కు చెందిన నిఖిల్ మాథ్యూ ఎన్నికయ్యారు.



స్మార్ట్ మీటర్‌ను తిప్పికొట్టారు

- బెంగాల్ ప్రజల ప్రణాళికాబద్ధ ప్రతిఘటన
- ప్రజాందోళనలతో దిగొచ్చిన మమత సర్కారు



విద్యుత్ రంగ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న వామపక్షాల కార్యకర్తలు (ఫోటో)

(ఫీచర్స్ అండ్ పాలిటిక్స్)

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరింగ్ ప్రాజెక్టు పశ్చిమ బెంగాల్లో నిలిచిపోయింది. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని నిలిపివేస్తూ జూన్ 9న ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజా ఉద్యమం సాధించిన ఘన విజయమిది. ఈ తరహా విజయం గత పదిహేనేళ్లలో ఇదే తొలిసారి.

విద్యుత్ రంగం వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగినది. ఈ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఈ ప్రాధాన్యతను పూర్తిగా తెలుసుకొని, ప్రజలకు సోదాహరణంగా వివరించి వారిని కార్యాచరణలోకి దించితే అహంకారపూరిత పాలకులను సైతం వణికించగలవని మరోసారి రుజువైంది.

ఆటంకాలను అధిగమించి..

ఈ ఉద్యమం ఎదుర్కొన్న ప్రధానమైన ప్రమాదాల్లో ఒకటి దీన్ని "అభివద్ధి వ్యతిరేక ఉద్యమంగా" ముద్ర వేసేందుకు పాలకులు, ఉన్నతాధికార వర్గాలు చేసిన ప్రయత్నం. కార్పొరేట్లు తీసుకొచ్చే సాంకేతిక మార్పులకు వ్యతిరేకంగా పోరాడే ప్రతి సందర్భంలో ఎదురయ్యే సాధారణ అవరోధమే ఇది. అయితే, ఈ విధమైన సాంకేతిక ప్రయోగాల వెనుక పాలక వర్గాల అసలైన ఉద్దేశాలను, వాటి ప్రభావాలను కార్మిక వర్గం మరియు సామాన్య ప్రజలపై ఎలా పడతాయో, ప్రజలలో స్పష్టంగా వెల్లడించడంవల్లనే ఈ విజయం సాధ్యపడింది. స్మార్ట్ మీటర్ కార్యక్రమం వెనుక దాగి ఉన్న కార్పొరేట్ ప్రయోజనాలను బహిర్గతం చేయడంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఈఎఫ్ఐ) కీలక పాత్ర పోషించింది. ప్రజాధనాన్ని కొల్లగొట్టి, ప్రైవేట్ కంపెనీల లాభాలను కాపాడేందుకు రూపొందించిన ఈ వివాదాస్పద ప్రణాళిక వెనుక దాగి ఉన్న ఉద్దేశాలను సమర్థవంతంగా బహిర్గతం చేసింది.

రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్సెస్) పేరిట కేంద్ర ప్రభుత్వం బలవంతంగా అమలు చేయాలనుకుంటున్నది ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరింగ్ పథకం. ఈ స్కీమ్ ప్రకారం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడమే కాకుండా, వాటిని ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల ద్వారా టోటెక్స్ విధానంలో నిర్వహించాల్సిందిగా కేంద్రం షరతులు విధించింది. ప్రైవేట్ కంపెనీలు కోట్ చేసిన ఈ మీటర్ల సగటు ధర రూ. 10,000 నుంచి రూ. 13,000. వాటి గరిష్ఠ ఆయుష్షు ఆరేడు సంవత్సరాలు మాత్రమే. అంటే, ప్రతి గహ వినియోగదారు సంవత్సరానికి అదనంగా సుమారు రూ. 2,000 భారం భరించాల్సి వస్తుంది. రాష్ట్ర డిస్కామ్‌లకూ, ప్రజలకూ దీని వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు.

అసలు ఉద్దేశాలను వెలికితీయడం

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరింగ్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఎందుకు పోరాటం చేయాల్సి వచ్చిందో, ప్రజలకు ఎదురయ్యే అసలైన ప్రమాదాలేంటో స్పష్టంగా కనుగొని, వాటిని సమర్థంగా చెప్పటం కీలకమైంది. ఈ విధానం వల్ల సామాన్య ప్రజలపై పడే భారాలను వివరించడం ముఖ్యమైనది.

ప్రీపెయిడ్ మీటరింగ్ విధానం అనేది వినియోగదారుల డబ్బుతో కంపెనీలు తమ వ్యాపారం నడపడమే. పైగా, ప్రీపెయిడ్ బ్యాలెన్స్ పూర్తయిన ప్రతిసారి అది కంపెనీ తప్పిదం వల్లనే అయినా ఆ ఇంటికి విద్యుత్ సరఫరా తక్షణమే ఆగిపోతుంది. ఈ విధానం ద్వారా ప్రభుత్వ సబ్సిడీలన్నింటినీ, ముఖ్యంగా పేదలు, రైతులకిస్తున్న రాయితీలను సమూలంగా తొలగించబోతున్నారు. గ్యాస్ సబ్సిడీలను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (ఐడీ) పద్ధతిలో మార్చినప్పుడు జరిగిన పరిస్థితి అందరికీ తెలిసిందే. అదే విధంగా, వినియోగదారుడే తన మీటర్ ఖర్చును భరించాల్సి ఉండడం వల్ల ఒక కొత్త ఆర్థిక భారం పడనుంది. ఇంకా, ఈ ప్రాజెక్టు ద్వారా ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు డిస్కామ్‌ల నెట్‌వర్క్‌లోకి ప్రవేశించేందుకు టెక్నికల్ మెకానిజాన్ని కల్పిస్తోంది. స్మార్ట్ మీటరింగ్‌తో వినియోగదారులను ఓపెన్ ఎలక్ట్రిసిటీ మార్కెట్‌లోకి నెట్టివేయడానికి మార్గం వేసి, డైనమిక్ ప్రైసింగ్ విధానాలను అమలు చేయడానికి అనుకూలంగా మారబోతోంది. అంతేకాక, సామాన్యుల వ్యక్తిగత విద్యుత్ వినియోగ డేటా, ప్రదేశాల వారీగా సమూహాల వినియోగ వివరాలను అంతర్జాతీయ మార్కెట్ దందాల్లో పాల్గొనే బడా కంపెనీలకు అప్పగించనుంది. దీంతో, వారు డిమాండ్ ప్యాటర్న్‌లను తేల్చి, ప్రజలపై 'టైమ్ ఆఫ్ డే టారిఫ్' పేరుతో అధిక, డిమాండ్ ఆధారిత రేట్లను విధించే అవకాశం కలుగుతుంది. ఈ ప్రాజెక్టు వెనుక దాగి ఉన్న ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను ప్రజలకు సులువుగా అర్థమయ్యేలా బహిర్గతం చేయడం ఉద్యమ ప్రతినిధుల బాధ్యత.

రాష్ట్ర డిస్కామ్‌లు తమ ఆదాయ వసూలు కోసం ప్రైవేటు స్మార్ట్ మీటరింగ్ ఏజెన్సీలపై ఆర్థికంగా ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా సైబర్ దాడుల వల్ల గ్రిడ్ వైఫల్యాలు జరిగే ప్రమాదముంది. ఈ ప్రాజెక్టు అసలు ఉద్దేశ్యం సాంకేతిక అభివద్ధి గానీ, కేంద్ర గ్రాంట్లను సమర్థంగా వినియోగించడం గానీ కాదు. ఇది పూర్తిగా ప్రైవేటీకరణ, కార్పొరేట్ నియంత్రణకు మార్గం వేయడమే.

ఉద్యమ ప్రణాళిక

కార్యాచరణ ప్రణాళికలో మొదట కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ మీటరింగ్ ప్రాజెక్టు వెనుక దాగి ఉన్న అసలైన ప్రయోజనాలను గుర్తించడం, వాటిని విశ్లేషించడం, విద్యుత్ ఉద్యోగులకు అవగాహన కల్పించడం నుంచే ప్రారంభమైంది. అంతే కాకుండా, ఈ అంశాన్ని రైతులు, కార్మికులు, చిన్న వాణిజ్యవేత్తలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల యజమానులు వరకు తీసుకెళ్లడం రెండవ ముఖ్యమైన కార్యాచరణ. ఈ విస్తత ప్రచారాన్ని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పట్టుదలతో, నిబద్ధతతో చేపట్టారు. ప్రతి జిల్లాలో వినియోగదారుల–ఉద్యోగుల సదస్సులు నిర్వహించారు. అనంతరం సమితి, గ్రామ పంచాయితీ, వార్డు స్థాయిలో సమావేశాలు, ప్రచార సభలు జరిగాయి. నివాస సంక్షేమ సంఘాల వరకు ఈ ఉద్యమం తక్కువ సమయంలోనే విస్తరించింది.

ఈ ప్రాజెక్టు తక్షణ ప్రమాదాలే కాదు, దీర్ఘకాలిక ప్రభావాలు ఏమిటో సవివరంగా, సూటిగా, ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు నిర్వాహకులు విశేష శ్రద్ధ తీసుకున్నారు. దీనికి అద్భుత స్పందన లభించింది. చిన్నచిన్న, మారుమూల గ్రామాలలో కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ సమావేశాలకు హాజరై, తొలుత సాంకేతికంగా క్లిష్టంగా కనిపించే ఈ అంశంపై ఆసక్తిగా వినడం, చర్చించడం మొదలుపెట్టారు. చిన్న చిన్న వీధి మూల సభలు కొద్దికొద్దిగా భారీ సభలుగా మారాయి. ప్రజల జీవితం, జీవనోపాధిని నేరుగా ప్రభావితం చేసే అంశంగా ఈ ఉద్యమం రూపుదిద్దుకోవడంతో ప్రజలు పెద్దఎత్తున భాగమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తొలి దశలో దాదాపు 37 లక్షల గహాలకు డిసెంబర్ 2023 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. అయితే ఉద్యమ ఉధృతిని అంచనా వేసిన ప్రభుత్వం, 2023లోనే కాదు, 2024లో కూడా ప్రాజెక్టును ముందుకు నడిపించలేకపోయింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ ప్రణాళికను అమలు చేయించేందుకు నిరంతరం ఒత్తిడి తీసుకువచ్చింది. ఈ పరిస్థితిలో, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాలు అనేక మహజర్లు సమర్పించాయి, నిరసనలు, ఆందోళనలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో కేరళ అనుభవం ఒక ప్రామాణిక ఉదాహరణగా నిలిచింది. అయినా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, రాష్ట్ర విద్యుత్ శాఖ ఉద్యోగుల ఆందోళనలు, అభిప్రాయాలు పట్టించుకోలేదు. దానికి బదులుగా రాష్ట్ర విద్యుత్ కార్పొరేషన్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లతో ప్రయోజనాలున్నాయని గాలి కబుర్లతో మీడియా ప్రచారం ప్రారంభించింది. 2024 చివరికి, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కొన్ని సబ్ డివిజన్‌లలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల అమలును ప్రారంభించింది. ప్రజలకు తెలియజేయకుండా, ఏ అవసరం లేకపోయినా, పని చేస్తున్న పాతవాటిని తొలగించి స్మార్ట్ మీటర్లను అమర్చడం మొదలుపెట్టింది. దాంతో ప్రజల్లో తీవ్ర అసహనం చెలరేగింది. ప్రైవేటీకరణను దొడ్డిదారిన తెచ్చేందుకు చేస్తున్న కుట్రగా భావించి, ప్రజలు సంఘటితమై వ్యతిరేకించడం మొదలుపెట్టారు. చాలా చోట్ల కొత్తగా అమర్చిన ప్రీపెయిడ్ మీటర్లతో బిల్లులు భారీగా రావడంతో, ప్రజాగ్రహం భగ్గుమంది. సిఐటియు తక్షణమే స్పందించి విద్యుత్ శాఖ కార్యాలయాల ఎదుట నిరసనలు, ధర్నాలు నిర్వహించింది. ప్రారంభంలో శాఖాధికారులు ప్రీపెయిడ్ మీటరింగ్‌ను తప్పనిసరి చర్యగా ప్రజలకు నమ్మించేందుకు ప్రయత్నించారు. కానీ ప్రజా ఉద్యమం ఊపందుకున్న కొద్దీ, జిల్లాలన్నీ ఆందోళనలతో దద్దరిల్లిపోవడంతో, ప్రభుత్వానికి ప్రజల వ్యతిరేకత తీవ్రతను, ఈ ప్రాజెక్టుపై విస్తత వ్యతిరేకతను గుర్తించక తప్పలేదు. అంతిమంగా, ప్రభుత్వం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరింగ్ ప్రాజెక్టును నిలిపివేసి, అధికారికంగా వెనక్కి తీసుకుంది.

నేర్చుకోవాల్సిన పాఠాలు

- ఒక అంశాన్ని సరిగ్గా గుర్తించి, దాని ప్రభావాలను అధ్యయనం చేసి, ప్రణాళికాబద్ధంగా ప్రజల్లోకి తీసుకెళ్లినపుడు, అది ప్రజల మనసులను లోతుగా తాకుతుంది. ఒకసారి ప్రజలు ఆ అంశాన్ని తమ సొంతంగా భావిస్తే, ఎంత అహంకారపూరిత ప్రభుత్వం అయినా ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోక తప్పదు.
- ప్రజల జీవితం, జీవనోపాధికి నేరుగా సంబంధించిన అంశాలు పెద్ద ఎత్తున జనంలో సామూహిక చైతన్యాన్ని ఏర్పరచగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. విద్యుత్‌పై జరుగుతున్న పోరాటం, స్పష్టమైన దష్టితో, సుదీర్ఘంగా ప్రణాళికతో చేయగలిగితే, ప్రజారోగ్యం, విద్య తదితర హక్కుల కోసం మరింత విస్తత ఉద్యమంగా మారగలదు.
- ఈ ఉద్యమం సేవారంగ కార్మిక సంఘాలకు కీలకమైన పాఠాన్ని నేర్పింది. సేవారంగ ఉద్యోగులు, ఆ సేవల వినియోగదారులు లేదా లబ్ధిదారులు కలిసినపుడు, ఉద్యమశక్తి అనూహ్యంగా పెరుగుతుంది. ఇది కేవలం రంగానికే పరిమితమైన నిరసనగా మిగలకుండా, విస్తత ప్రజా పోరాటంగా రూపుదిద్దుకుంటుంది.
- ప్రైవేటీకరణ కొత్త కొత్త రూపాలు, దాగి ఉన్న సాంకేతిక, ఆర్థిక వ్యూహాలతో ఎలా ముందుకు సాగుతోందో అర్థం చేసుకోవడం ఎంత అవసరమో ఈ ప్రచారం చూపించింది. ఈ ప్రక్రియల లోతైన, స్పష్టమైన అవగాహన వుండగానే విజయవంతమైన ప్రజా ఉద్యమానికి బలమైన పునాది ఏర్పడుతుంది.
- ఈ పోరాటం ప్రస్తుత నయా ఉదారవాద భారతదేశంలో కార్పొరేట్లు చొరబడి ప్రజల సంపదను దోచేయడంపై జరుగుతున్న ప్రతిఘటన దశను పునర్నిర్వచించాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది. ప్రజా వనరులపై కార్పొరేట్ జోక్యాన్ని అడ్డుకోవడం ఈరోజు భారత ప్రజల పోరాటాలకు గుండెకాయ.
- ఈ పోరాటం ద్వారా పశ్చిమ బెంగాల్ ప్రజలు ఈ చీకటి కాలంలో ఒక ఆశాకిరణాన్ని వెలిగించారు. ఈ విజయం సామూహిక పోరాటాల పట్ల నమ్మకాన్ని మరింత బలపరచడమే కాకుండా, మున్ముందు అనేక పోరాటాలకు ద్వారాలు తెరిచింది. ఇది ప్రజా ఉద్యమాలకు పునరుత్తేజం కలిగించే విజయంగా చరిత్రలో నిలిచిపోతుంది.

'గురుగావ్' కాన్ఫరెన్స్‌కు 25 మంది ఎంపిక

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

హర్యానాలోని గురుగావ్‌లో జులై నెల 3 నుంచి రెండు రోజులపాటు పట్టణ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల జాతీయ స్థాయి సమావేశానికి రాష్ట్రం నుంచి 25 మందిని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గురుగావ్‌లో జరిగే ఈ కాన్ఫరెన్స్‌లో 'ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర'పై చర్చిస్తారు. ఈ కాన్ఫరెన్స్‌కు రాష్ట్రం నుంచి ఐదుగురు మేయర్లు, ముగ్గురు డిప్యూటీ మేయర్లు, 16 మంది ఛైర్మన్లు, ఒక డిప్యూటీ ఛైర్మన్ ఎంపికైన వారిలో ఉన్నట్లు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఆర్‌డిఎంఎను ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులకు రవాణా, వసతి ఖర్చులను నిర్వహణ సంస్థలే భరిస్తాయని పేర్కొన్నారు.

ఒప్పందం ఉల్లంఘిస్తే తడాఖా చూపిస్తాం

- ఇజ్రాయిల్‌కు ఇరాన్ హెచ్చరిక

టెహరాన్: కాల్పుల విరమణ ఒప్పందం పాటించడంలో ఇజ్రాయిల్ నిబద్ధతపై పలు అనుమానాలు ఉన్నాయని ఇరాన్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దుల్ రహీం మౌసావి అన్నారు. ఆ దేశం ఒప్పందాన్ని ఉల్లంఘించి మరోసారి దాడులు చేస్తే, ధీటుగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సౌదీ అరేబియా రక్షణశాఖ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్‌తో ఆదివారం జరిగిన భేటీ సందర్భంగా మౌసావి ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఇప్పటి వరకు యుద్ధం ప్రారంభించలేదనీ, కేవలం ఇజ్రాయిల్ దాడులకు పూర్తి స్థాయిలో ప్రతిస్పందించామని అన్నారు. ఈ విషయాన్ని ఇరాన్ అధికారిక మీడియా సంస్థ తస్నీమ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి ఆ ఒప్పందాన్ని ఇరు దేశాలు పాటిస్తున్నా, పరస్పర అనుమానాలు, ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి.

థాయిలాండ్‌లో ఆందోళనలు

- ప్రధాని రాజీనామాకు డిమాండ్
- ఫోన్‌కాల్ లీక్‌తో ముదిరిన వివాదం



ప్రధాని పెతాంగ్‌టార్న్ షినవత్రా రాజీనామా చేయాలనే డిమాండ్‌తో థాయిలాండ్ వీధుల్లో ఆందోళన చేస్తున్న ప్రజలు

బ్యాంకాక్ : ప్రముఖ పర్యాటక దేశం థాయిలాండ్‌లో నిరసనలు హోరెత్తాయి.ఆ దేశ ప్రధాని పెతాంగ్‌టార్న్ షినవత్రా రాజీనామా కోరుతూ లక్షలాది థాయి ప్రజలు శనివారం నాడు రోడ్డెక్కారు.కంబోడియా మాజీ ప్రధాని హున్‌సేన్ జరిపిన ఫోన్ సంభాషణ లీక్ కావడంతో ప్రజలు ఆగ్రహించారు.బ్యాంకాక్‌లోని విక్టరీ మాన్యుమెంట్ వద్ద నిరసనకారులు జాతీయ జెండాలు, బ్యానర్లతో రోడ్లను ఆక్రమించారు.ఈ ర్యాలీలో ప్రజలు భారీగా పాల్గొని, ప్రధాని రాజీనామా చేయాలని నినదించారు.

థాయిలాండ్, కంబోడియా మధ్య సరిహద్దు వివాదాలు దీర్ఘకాలంగా కొనసాగుతున్నాయి. 1962లో ఐసీజే తీర్పు ప్రకారం, ప్రేహ్ విహార్ ఆలయం ఉన్న వివాదాస్పద ప్రాంతం కంబోడియాకు చెందుతుందని కోర్టు తీర్పు ఇచ్చింది. 2011లో అక్కడ ఘర్షణలు చెలరేగిన నేపథ్యంలో 2013లో మరోసారి ఆ తీర్పును యుఎన్ కోర్టు ధృవీకరించింది.

ఫోన్‌కాల్ లీక్ వివాదం:

మే 28న ఇరు దేశాల సరిహద్దులోని వివాదాస్పద ప్రాంతంలో ఘర్షణలు సంభవించి ఒక కంబోడియన్ సైనికుడు మరణించాడు. ఈ ఘటన రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ నెల15న పెతాంగ్‌టార్న్ , హన్‌సెన్‌ల మధ్య ఫోన్ సంభాషణలు లీక్ అయ్యాయి. థాయ్ ఆర్మీ జనరల్‌ను కించపరిచేవిధంగా అందులోని వాఖ్యలున్నాయని, ఇది థాయిలాండ్‌ను, సైన్యాన్ని అవమానించడమేనని నిరసన కారులు ఆరోపించారు. ఈ నిరసనలో థాయ్ రాజవంశ విధేయుల సంస్థ యెల్లో షర్ట్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ ఫోన్ కాల్ లీక్ కావడంతో థాయిలాండ్ ప్రభుత్వ రాజ్యాంగ కోర్టు, జాతీయ అవినీతి నిరోధక సంస్థ దర్యాప్తు చేస్తున్నాయి. ఈ వివాదం రాజకీయ సంక్షోభానికి దారి తీసింది. పెతాంగ్‌టార్న్ సంకీర్ణ ప్రభుత్వంలో పెద్ద భాగస్వామి భుమ్‌జైతాయి పార్టీ తన మద్దతు ఉపసంహరించుకుంది. దీంతో 10 పార్టీల సంకీర్ణ ప్రభుత్వం 255 సీట్లతో స్వల్ప ఆధిక్యంతో ప్రభుత్వాన్ని నడుపుతుంది. ఇది త్వరలోనే కూలిపోతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

హమాస్‌తో ఒప్పందం చేసుకోండి

- ఇజ్రాయిల్‌కు ట్రంప్ సూచన

వాషింగ్టన్: గాజాలో హమాస్‌తో ఒప్పందం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయిల్‌ను కోరారు. యుద్ధాన్ని ముగించి, సంధి కుదుర్చుకోవాలన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. గాజాతో ఒప్పందం చేసుకొని, బందీలను వెనక్కి తీసుకురావాలని ఇజ్రాయిల్‌కు సూచించారు. గాజాలో కూడా కాల్పుల విరమణ పాటించాలని ట్రంప్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీనిపై ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుపై ఆయన ఒత్తిడి పెంచారు. గాజాతో వచ్చేవారం సంధి కుదురుతుందని ప్రకటించిన కొన్ని గంటల్లోనే, ఒప్పందం కుదుర్చుకోమంటూ సోషల్ మీడియాలో మళ్లీ పోస్ట్ పెట్టారు. అదే సమయంలో నెతన్యాహుపై కేసులను వదిలేయాలని ఇజ్రాయిల్ ప్రాసిక్యూటర్లను అభ్యర్థించారు. ఇటీవలి కాలంలో ఇజ్రాయిల్‌కు ఆమెరికా సహాయాన్ని గణనీయంగా పెంచింది. వాషింగ్టన్ నుంచి ప్రపంచంలో మరే దేశానికి అంత స్థాయిలో ఆర్థిక సాయం అందలేదు.

పూరీలో తొక్కిసలాట

(మొదటిపేజీ తరువాయి)

ఉంచడంతో పరిస్థితి అదుపు తప్పింది. శనివారం రాత్రి పోలీసుల జాడే కన్పించలేదని, దీంతో ప్రజలను అదుపు చేయడం సాధ్యపడలేదని మృతుల బంధువులు పేర్కొన్నారు. కాగా పలువురు బిజెపి మంత్రులు తమ బంధువులు, స్నేహితులను రథాల చెంతకు తీసుకుపోవడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. రథయాత్రలో ఈ నెల 27న కూడా తొక్కిసలాట లాంటి పరిస్థితులు, భారీ ఉష్ణోగ్రతల కారణంగా 600 మంది పైగా అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలైన సంగతి విదితమే. రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ గొప్పలు చెప్పుకునే బిజెపి ప్రభుత్వం ఒడిశా ప్రజలు ఎంతో ఆరాధించే జగన్నాథ రథయాత్రను కూడా సరిగా నిర్వహించలేకపోవడం దారుణమని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విమర్శించారు. భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వల్లే తొక్కిసలాట జరిగిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. మృతులకు తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విశాఖ భూములపై 'పతంజలి' కన్ను !

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఆ జిఒలను రద్దు చేసింది. ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకూడదని జిఒ ఎంఎస్ నెంబర్ 571/2012 సెప్టెంబర్ 14లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒకవేళ తప్పనిసరి అయితే అటువంటి భూముల విషయంలో ప్రైవేట్ సంస్థ నుంచి సంవత్సరానికి భూమి మార్కెట్ ధర మీద కనీసం పది శాతం లీజు రెంటు వసూలు చేయాల్సి ఉంది. కొత్తవలసలో రాష్ట్ర రిజిస్ట్రేషన్ విభాగం నిర్ణయించిన ధరల ఆధారంగా మార్కెట్ ధర ఎకరానికి రూ.1.2 కోట్లు ఉంది. కనీసం ఆ విషయాన్ని కూడా పరిగణలోకి తీసుకోకుండా నాటి ప్రభుత్వం చౌకగా శారదాపీఠానికి భూములను కేటాయించింది. నేడు కూటమి ప్రభుత్వమూ ఆ దారిలోనే వెళ్తోంది.

సుప్రీం కోర్టు తీర్పు ఉల్లంఘన : రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ

సుప్రీంకోర్టు 2011 జనవరి 28న జగపాల్ సింగ్ కేసులో ఇచ్చిన తీర్పులో ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించాలి. ప్రైవేట్ సంస్థలకు బదలాయించకూడదు. ఇటీవల ఓ ప్రయివేటు సంస్థ అధినేత భీమిలిలో అధికారులతో కలిసి పర్యటించి భూముల అన్వేషణ సాగించడం తీవ్ర ఆక్షేపణీయం.

ప్రభుత్వం నుంచి అలాంటి సమాచారం లేదు : విశాఖ జెసి

'భీమిలి మండలంలో రామ్‌దేవ్ బాబాకు స్థల కేటాయింపుల విషయమై ప్రభుత్వం నుంచి ఇంతవరకూ మాకు ఎలాంటి సమాచారమూ రాలేదు' అని విశాఖ జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ 'ప్రజాశక్తి'కి తెలిపారు.



చిన్నారి

6 విజయవాడ
సోమవారం 30 జూన్ 2025

జీవన సారథ్యం

జీవితంలో ప్రతిరోజూ నిన్నటి కన్నా ఎక్కువ విషయాలు నేర్చుకుంటూ ఉండాలి.

మీ కోసం


ఫ్రిజ్ నుంచి ఘాటైన వాసనలు రాకుండా ఉండాలంటే న్యూస్‌పేపరును నీళ్లల్లో ముంచి కాసేపు ఉంచాలి. ఆ తరువాత ఆ నీటిని పిండేసి, ఓ గిన్నెలో ఈ తడి కాగితాన్ని ఉంచి ఫ్రిజ్ లోపల పెడితే సరిపోతుంది.



JEEVANA

జీవన the family

రోడ్డు - భద్రత



రాము, గోపి ఇద్దరూ మంచి స్నేహితులు. వాళ్లు పదవ తరగతి చదువుతున్నారు. వాళ్ల పాఠశాలకు వెళ్లే దారిలో ఒక రోడ్డు ఉంది. అది పెద్ద రహదారి. రోడ్డు భద్రతా నియమాలు తెలుసుకుని, వారు ప్రతి రోజూ సురక్షితంగా రోడ్డు దాటుతారు.

ఒక రోజు వారు రోడ్డు దాటిన తర్వాత, వెనక ఏదో పెద్ద శబ్దం వినపడింది. ఇద్దరూ వెనక్కి తిరిగి చూసారు. అతి వేగంగా వచ్చిన ఒక బైక్ కింద పడింది. బైక్ నడుపుతున్న యువకుడు రోడ్డుపై పడిపోయాడు. అతనికి బాగా గాయాలయ్యాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో, రాము, గోపి సమీపంలోని ప్రజల దగ్గరికి పరుగున వెళ్ళి చెప్పారు. వారు అంబులెన్స్‌కు ఫోన్ చేసారు. కొందరు ఆ యువకుడికి నీరు తాగించి ప్రథమ చికిత్స చేసారు. కొంతసేపటికి అక్కడికి చాలా మంది వచ్చారు.

వచ్చిన ప్రతి ఒక్కరూ 'బైక్‌ను నెమ్మదిగా నడపాలని ట్రాఫిక్ లైట్ల హెచ్చరికను పాటించాలని, హెల్మెట్‌లు ధరించాలని, రోడ్డు దాటే సమయంలో వాహనాలను చూడాల'ని ఒకరికొకరు చెప్పుకున్నారు.

ఈలోపు అంబులెన్స్ వచ్చింది. అందులో యువకుడిని పంపించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలకు సమాచారం అందించి, యువకుని ప్రాణాలు కాపాడిన రాము, గోపిలను అందరు మెచ్చుకున్నారు.



- వంగపల్లి రిత్విక్,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా.

బాల ప్రపంచం

బడిబాట పట్టింది బాలలోకం
ఒక్కటై పాడారు జాతీయగీతం
గురువులు చెప్పే జ్ఞాన గమకం
భవితకు మీరే పసిడి తారకం

విద్య వినయంలో చూపు వివేకం
ఆట పాటల్లో గెలుపు సంతకం
విడనాడాలి చరవాణీల మైకం
మంచి వాటితో అవ్వాలి మమేకం
కన్నవారికి సదా మీరే కదా
కనకం

భరతమాతకు దిద్దు వీరతిలకం
మీరు సాధించిన విజయాలను
చూసి నచ్చును మెచ్చును మీకు
కానుకలిచ్చును ఈ భూలోకం!!

- బోనగిరి. పాండురంగ,
83412 12132.



నేను గీసిన బొమ్మ



తోటపల్లి అనూ శ్రీ,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్,
సిద్దిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆటలతోనే పిల్లల్లో వికాసం....

నేటి రోజుల్లో వ్యాయామం అనేది చాలా ముఖ్యం. పెద్దలకే కాదు. పిల్లలకు కూడా చిన్నప్పటి నుంచే వ్యాయామం అలవాటు చేయాలి. చిన్నపిల్లలు చాలా సున్నితంగా ఉంటారు. కాబట్టి వారి ఆరోగ్యాన్ని కాపాడే చిన్నపాటి వ్యాయామాలు చేయిస్తే బాగా ఆరోగ్యంగా ఉంటారు. నేటి సమాజంలో ఏ వయస్సులో ఎవరికి ఏ వ్యాధి వస్తుందో చెప్పలేం. దానికి ప్రధాన కారణం చిన్నప్పటి నుంచే శారీరక శ్రమ లేకపోవటమే. చిన్నప్పటి నుంచే వ్యాయామం అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా జీవించొచ్చు. పిల్లలు గంటల తరబడి ఒకేచోట కూర్చోవటం వల్ల ఊబకాయం, గుండెజబ్బులు, షుగర్ వంటివి వస్తున్నాయి.



పాఠశాలల్లో వ్యాయామం ఒక భాగంగా ఉండటంతో విద్యార్థులు చురుగ్గా ఉండటానికి, ఏకాగ్రతతో చదువుకోవటానికి అవకాశం ఉంటోంది. వ్యాయామం చేయడం వల్ల ఎన్నో లాభాలున్నాయి. నడక, పరుగు, ఈత, టెన్నిస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి ఆటలు.. గోల్ఫ్, సైకిల్ తొక్కటం వంటివి కూడా వ్యాయామాలే. పిల్లలకు శారీరక వ్యాయామం తక్కువగా ఉంటోంది. ఫోన్లతో ఆడుతూ, టివిలు చూస్తూ ఆహార పదార్థాలు తినటం ద్వారా కొందరు స్థూలకాయులుగా మారుతున్నారు. ఇలాంటి సమయంలో తల్లితండ్రులు కూడా కొంత బాధ్యత తీసుకుని వారిని ఈ ఫోన్, టివి అలవాట్ల నుంచి మరల్చే వ్యాపకాలపై దృష్టిసారించి అమలుచేయాలి. వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడే వ్యాయామాలకు ప్రోత్సహించాలి.

మీ పిల్లలతో ఆడుకోండి : తల్లిదండ్రులు పిల్లలతో కొంత సమయం కేటాయించి ఆడుకోవాలి. తద్వారా పిల్లలు కూడా ఉత్సాహపడి ఇంకా సంతోషంగా ఆడతారు. వారికి ఏయే ఆటల్లో ఇష్టమో తెలుసుకుని అందులో ప్రోత్సహించాలి. ఆటలు ఆడేందుకు అవసరమైన మౌలిక వసతులు కూడా కల్పించాలి. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేసే వారైనా ప్రతిరోజూ ఎంతోకొంత సమయం పిల్లల కోసం కేటాయించాలి. వారితో సమయం గడపకుంటే పిల్లలు మానసికంగా కృంగిపోతారు. ఒంటరిగా ఫీల్ అవుతారు. టీవీ చూస్తే కుటుంబం అంతా కలిసి చూడటం మేలు. వారికి రిమోట్ ఇచ్చేసి వదిలేయకూడదు. ఇలా చేయడం వల్ల వారు గంటల తరబడి టివికి అతుక్కుపోతుంటారు.తద్వారా కంటి సమస్యలు తలెత్తుతాయి. అలాకాకుండా ఈ కొద్ది పాటి మార్పులు చేసుకొని పిల్లలను వ్యాయామం చేసేలా ప్రోత్సహించండి.



చదువుతోపాటు ఆటోల్లోనూ ప్రోత్సాహం : పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకోవటం తల్లిదండ్రుల బాధ్యత. చదువులో సబ్జెక్టు అంశాల్లో ఎక్కడా వెనుకబడకుండా చూసుకోవాలి. ప్రతిరోజూ పాఠశాల, కళాశాలల్లో ఇచ్చే వర్కులు పూర్తయ్యేలా పర్యవేక్షించుకోవాలి. ఆనక క్రీడాంశాల్లోనూ ప్రోత్సహించాలి. వ్యక్తిగతంగా ప్రతిరోజూ వ్యాయామం చేసేలా ప్రోత్సహించాలి. పాఠశాలల్లో నిర్వహించే ఆటలపోటీల్లో చురుగ్గా పాల్గొనేలా సన్నద్ధం చేయాలి.

పరికరాలు కొనివ్వండి : సాధారణంగా పిల్లలకు బొమ్మలను కొనిస్తూనే ఉంటారు. వాటికి బదులుగా వారికి ఉపయోగపడేలా క్రికెట్ బ్యాట్, స్కిప్పింగ్, బాడ్మింటన్, షెటిల్‌బ్యాట్లు, వాలీబాల్, బాస్కెట్‌బాల్ ఇలా కొన్ని రకాల ఆట పరికరాలను కొనివ్వండి. ఇలా చేయడం వల్ల వారికి బోర్‌గా అనిపించకుండా వీటితో ఆడుకుంటారు.

క్షేత్రస్థాయి పర్యటనలు మేలు : పిల్లలను తల్లిదండ్రులు బయట విహార యాత్రలకు తీసుకెళ్తే కొత్త విషయాలు తెలుసుకుంటారు. సెలవు రోజుల్లో కొంత విభిన్నంగా ప్రణాళికలను రూపొందించుకుని వెళ్తే ఆయా ప్రాంతాల్లోని విశేషాలతోపాటుగా చారిత్రిక అంశాలు వంటివి తెలుసుకుంటారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో వ్యవసాయం, పరిశ్రమలు, చారిత్రక ప్రదేశాలు, పరిశోధనా విషయాలు వంటివి కొన్ని తెలుసుకునే వీలుంటుంది. స్విమ్మింగ్, పర్వత ప్రాంతాలకు తీసుకెళ్తే ఇంకా సంతోషంగా ఉంటారు. ప్రకతితో వారు మమేకం కాగలరు. ఇటువంటివి చేయడం అలవాటుగా చేసుకుంటే ఆనందకర కుటుంబాన్ని పొందగలరు. ఇలా వెళ్లిన చోట్ల నడవటం, పరిగెత్తటం వంటివి చేయటం శారీరక శ్రమలో భాగమే.

ఇంటి పనుల్లో ప్రోత్సాహం : తల్లిదండ్రులు సాధారణంగా ఇంట్లో పనులకు పిల్లలను దూరంగా ఉంచుతారు. అలాకాకుండా వారిని కూడా వారాంతంలో ఒకసారి మమేకం చేయాలి. వారికి చిన్న పనులు చేసేలా ప్రోత్సహించాలి. వారు పనులు నేర్చుకున్నట్లూ ఉంటుంది. పనులు చేస్తుంటే వారి శరీరానికి వ్యాయామం చేసినట్లు కూడా ఉంటుంది కూడాను. తుడవడం, ఇల్లు శుభ్రం చేయడం, ఇల్లు కడగడం, తోట పెంచడం, తోట శుభ్రం చేయడం వంటి పనులు చేయించొచ్చు. ఇంట్లో వస్తువులను చక్కగా అమర్చడం కూడా నేర్పించొచ్చు. ఇది వాళ్ళలో క్రమశిక్షణను మెరుగు పరుస్తుంది.


ఆరోగ్యం మెరుగుదల : పిల్లలు రోజూ వ్యాయామం చేస్తే.. ఎముకలు, కండరాలు దృఢంగా ఉంటాయి. హృదయ దృఢత్వాన్ని మెరుగుపరుస్తుంది. రోగనిరోధక పనితీరును పెంచుతుంది. మొత్తం శారీరక శ్రేయస్సును ప్రోత్సహిస్తుంది. పిల్లలో ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి రోజూ వారితో వ్యాయామం చేయించాలి.

సామాజిక నైపుణ్యాలు

టీమ్ స్పోర్ట్స్, గ్రూప్ ఎక్సర్ సైజ్‌లు వంటి శారీరక కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల పిల్లలు సామాజిక నైపుణ్యాలు, టీమ్‌వర్క్, సహకారం, కమ్యూనికేషన్‌ను అభివృద్ధి చేసుకోవచ్చు. పిల్లల వ్యాయామాలలో ఆనందించే యాక్టివిటీస్ చేర్చండి. డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్, స్విమ్మింగ్, బైక్ రైడింగ్ వంటి వారు ఇష్టపడే, ఆసక్తికరంగా ఉండే వ్యాయామాలు చేరిస్తే మేలు. ఇలా చేస్తే వాళ్ళ వ్యాయామం చేయడానికి ఆసక్తి చూపిస్తారు.

చురుగ్గా...ఉత్సాహంగా : పిల్లలకు విసుగు రాకుండా.. రకరకాల వ్యాయామాలు వారి రొటీన్‌లో చేర్చాలి. టీమ్ స్పోర్ట్స్, యోగా, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఏరోబిక్ ఎక్సర్‌సైజుల వంటి వర్కవుట్స్ మారిస్తే పిల్లలు యాక్టివ్‌గా ఉంటారు. డాన్స్ కేవలం ఒక కళారూపం మాత్రమే కాదు.. మంచి వ్యాయామం కూడా. తల్లిదండ్రులు పిల్లలకు సులభమైన స్టెప్ట్ నేర్పించి, వాళ్ళతో చేయించొచ్చు. ఇది శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యానికీ మంచిది. విదేశాల్లో టీవీలో మెలోడీ పాటలు పెట్టుకుని, సులభమైన స్టెప్స్‌తో నత్యం చేయడం వ్యాయామంగా చేస్తారు. ఇప్పుడు జిమ్‌లలో కూడా జుంబా అనే నృత్యం వ్యాయామంగా మారింది.

శారీరక దృఢత్వం : పిల్లలకు నడక చాలా అవసరం. ఇంట్లో మెట్లు ఉంటే 15 నిమిషాలు మెట్లు ఎక్కించండి. లేదా టెర్రస్ ఉంటే అరగంట నడవమనండి. దగ్గర్లో ఉన్న పార్కుల్లో ఆడుకోనివ్వడం మంచి వ్యాయామం. చెడు కొవ్వులు చెమట ద్వారా బయటకు పోతాయి. గుండె కొట్టుకునే వేగం సరిగ్గా ఉంటుంది. కరాటే, కుంగ్‌ఫూ, యోగా వంటివి కూడా నేర్పించటం మేలు. ఇలాంటి ఆత్మరక్షణ కళల ద్వారా ప్రతిరోజూ చేస్తే పిల్లలు చురుగ్గా ఉంటారు. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం దృఢంగా ఉంటుంది.



-ఎన్.నాగసాయికృష్ణ భాస్కర్
వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, రామవరప్పాడు, విజయవాడ రూరల్ మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 7989877355

అసమానతలపై శేఖర్ కమ్ముల ప్రయోగం 'కుబేర'

మూసకథల ధోరణిలో దూసుకుపోతున్న టాలీవుడ్‌లో సరికొత్త ప్రయోగం 'కుబేర' సినిమా. ఏలూరుజిల్లాకు చెందిన ఆయన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా అమెరికాలో కొన్నాళ్లు పనిచేసి ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చేశారు. ఆ తర్వాత అక్కడ పనిచేస్తూనే సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఆయన 25 ఏళ్ల సినీ ప్రస్థానంలో మంచి బ్లాక్‌బస్టర్ సినిమాలను అందించారు. తాజాగా ఆయన తీసిన 'కుబేర' సినిమా ఓ ప్రయోగమే. తమిళ స్టార్ నటుడు ధనుష్, అక్కినేని నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ పాన్ ఇండియా సినిమా ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై మంచి ఆదరణ పొందుతోంది. సామాజిక సందేశంతో కూడిన క్రైమ్ యాక్షన్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమా మొదట్లో మిశ్రమ స్పందన అందుకున్నా మరుసటిరోజు నుంచి పాజిటిక్ టాక్‌తో బాక్సాఫీసులో దూసుకుపోతోంది.



రొటీన్‌కి భిన్నం

శేఖర్ కమ్ముల గతంలో తీసిన ఆనంద్, గోదావరి, ఫిదా, లవ్‌స్టోరీ వంటి సినిమాల మాదిరిగానే, కుబేర కూడా కంటెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ధనుష్, నాగార్జున, రష్మిక నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. దేవిశ్రీప్రసాద్ సంగీతం, శేఖర్ కమ్ముల స్క్రీన్ ప్లే కూడా సినిమాకు బలంగా నిలిచాయి. ఓవర్సీస్‌లో కూడా సినిమా మంచి వసూళ్లను రాబట్టింది. అమెరికాలో విశేష ఆదరణ పొందింది.

అసమానతలకు ప్రతిరూపం

సినిమా అనేది సమాజ చైతన్యానికి ప్రతిరూపం. సమాజ రుగ్మతలను పట్టిచూపి వాటికి పరిష్కార మార్గాలను చూపే శక్తి కూడా దర్శకుడి ప్రతిభను బట్టి ఉంటుంది. సమాజంలోనూ, మన చుట్టూ ఉన్న ప్రాంతాల్లో జరిగే అంశాలను ఇతివృత్తంగా తీసుకుని సినిమాలు తీయటం తెలిసిందే. ఇవి బాక్సాఫీసు వద్ద హిట్‌ను కూడా అందుకుంటున్నాయి. అతి హింస, విపరీతమైన సెక్స్, విఎఫ్ఎక్స్‌తో సరికొత్త కల్పిత ప్రపంచాలు సృష్టిస్తూ వచ్చిన సినిమాలు కూడా ఆడుతున్నాయి. కానీ ఇవి సమాజానికి చేటుచేస్తున్నాయి. యువతను పక్కదారి పట్టించటమే కాకుండా మూఢత్వాన్ని పెంపొందించే ఆధ్యాత్మిక అంశాలను జోడించి తీసే సినిమాలు ప్రజలను పురాతన సనాతన భావాలవైపు తీసుకెళ్లి పతకానికి దారితీసేలా ఉంటున్నాయి. ఇవేవీకాకుండా సమాజానికి ఎంతోకొంత సందేశం ఇవ్వాలని శేఖర్ కమ్ముల భావించి ఈ సినిమా తీసినట్లుగా అనిపిస్తుంది.

అంతరాలపైనా...

దేశంలోనూ, ప్రపంచంలోనూ సమాజంలోనూ తీవ్రమైన అసమానతలు కొనసాగుతున్నాయి. సరళీకృత ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత పేదలు మరింత పేదలవుతుండగా సంపన్నులు మరింత సంపన్నులుగా మారిపోతున్నారు. ఈ కుబేర సినిమాలో కూడా ఇలాంటి అంశాలు మనకు మచ్చుకు కనిపిస్తాయి. డబ్బున్నవాడు, డబ్బు లేని వాడు, పెట్టుబడిదారుడు, కార్మికుడు ఇలా భిన్నమైన వర్గాల మధ్య జరిగే ఘర్షణ, సంఘర్షణ, సంభాషణ, పరస్పర సంఘర్షణలు చాలా సినిమాల్లో ఇట్టే చూడొచ్చు. జైభీమ్, లక్కీభాస్కర్, మహర్షి, ఖైదీనంబర్ 150, సింగం వంటి సినిమాల్లో కార్పొరేట్ దోపిడీని పట్టిచూపించాయి. వందేళ్ల సినిమా చరిత్రలో ప్రేక్షకుల అభిరుచిలో కూడా మార్పులొచ్చాయి. 1970 నుంచి 2000 వరకూ వచ్చిన మూస కథలకు ఇప్పుడు ఆదరణ ఉండటం లేదు. అందుకే శేఖర్ కమ్ముల సరికొత్త సబ్జెక్టును ఎన్నుకున్నారనిపిస్తుంది.

మనీలాండరింగ్ చుట్టూనే...

అత్యంత ధనవంతుడు, ఏమీ ఆశించని బిచ్చగాడికి మధ్య జరిగే పోరాటమే 'కుబేర'. బిచ్చగాడి పాత్రలో ధనుష్ (దేవా) ఔట్ స్టాండింగ్ ఫెర్ఫార్మెన్స్ ఇచ్చారు. నాగార్జున (దీపక్), రష్మిక పాత్రలు సినిమాకు బలం. శేఖర్ కమ్ముల దర్శకత్వం, ట్విస్టులు, ఎమోషనల్ సీన్లు ఆకట్టుకుంటాయి. డిఎస్‌పి సంగీతం సందర్భోచితంగా సాగింది. సినిమాటోగ్రఫీ, నిర్మాణ విలువలు బాగుతున్నాయి. కుబేర సినిమాలో మనీలాండరింగ్ అంశం చుట్టూ కథ తిరుగుతుంది. మనీలాండరింగ్ ఎలా జరుగుతుందో చూపించారు. ఇందులో రాజకీయ నాయకులు, బడా బ్యూరోక్రాట్లు, ఇతర వ్యక్తులు ఒక పథకంలో భాగస్వాములుగా ఉంటారు. ఈ పథకంలో డొల్ల కంపెనీలు, బినామీ లావాదేవీలు, ఇతర పద్ధతులను ఉపయోగించి అక్రమంగా సంపాదించిన డబ్బును మళ్ళిస్తారు. ఈ సినిమాలో ధనుష్ పాత్ర ఒక అమాయక వ్యక్తిగా కనిపిస్తుంది. అతను తెలియకుండానే మనీలాండరింగ్ స్కామ్‌లో చిక్కుకుంటాడు. నాగార్జున పాత్ర సిబిఐ ఆఫీసర్‌గా ఉండి, ఈ స్కామ్‌ను ఛేదించడానికి ప్రయత్నిస్తాడు. రష్మిక మందన్న పాత్ర కూడా ఈ కథలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మనీలాండరింగ్ నష్టాలను, రాజకీయ నాయకుల అవినీతి, సాధారణ ప్రజల జీవితాలపై దాని ప్రభావం ఎలా ఉంటుందనేది చక్కగా తెరకెక్కించారు. దీపక్ తాను చేసే ఒక కీలక ఆపరేషన్‌లో దేవా అనే బిచ్చగాడితో కలిసి పని చేయాల్సి వస్తుంది. అసలు దీపక్ ఎందుకు దేవాను ఎంచుకున్నాడు? వారిద్దరి ప్రయాణంలో ఎలాంటి మలుపులు చోటు చేసుకున్నాయి? అన్నది కథాంశం.

సారాంశం : శేఖర్ కమ్ముల తాను చెప్పదలచుకున్న కథాంశాన్ని చాలా సూటిగా, స్పష్టంగా తెరకెక్కించారు. సినిమా ప్రారంభంలోనే కథ సారాంశం అర్థమవుతుంది. దాదాపు రెండున్నర గంటల నిడివి ఉన్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆసక్తిగా చూసేలా చేయడంలో దర్శకుడు కొంతవరకు విజయం సాధించారు. ధనుష్ నటన ఈ సినిమాకు ప్రాణం పోసిందని చెప్పొచ్చు. బిచ్చగాడి పాత్రలో ఆయన పరకాయ ప్రవేశం చేసి, తన కెరీర్‌లో మరొక అద్భుతమైన ప్రదర్శనను ఇచ్చారు.

బిజెపి పాలనలో పరిస్థితులకు దర్పణం

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మనీలాండరింగ్ కేసులు బాగా పెరిగాయి. బడాకార్పొరేట్లు, మిలియనీర్లు మరింతగా రెచ్చిపోతున్నారు. మతోన్మాద, మూక దాడులు పెరిగాయి. ఈ క్రమంలో అభ్యుదయ భావాలతో తీసే సినిమాలపై కేంద్రం తన అధికారాన్ని ఉపయోగించుకుని సెన్సారు బోర్డు ద్వారా కొరడా ఝుళిపిస్తోంది. జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ అనే సినిమాలో 'జానకి' అనే పేరును మారిస్తేనే రిలీజ్ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్‌బోర్డు షరతులు పెట్టడం ఇలాంటి చర్యల్లో భాగమే. మతోన్మాదుల నుంచి అభ్యంతరాలు వచ్చాయనేది అభియోగం. 2017-2018లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన చిత్రం 'పద్మావత్'. కర్ణిసేన నుంచి అభ్యంతరాలు వచ్చాయనే పేరుతో పలు సీన్లకు కత్తెర వేశారు. చివరకు పద్మావతి సినిమా కాస్తా పద్మావత్‌గా మార్చాల్సివచ్చింది. మలయాళంలో 2017లో సెక్సీ దుర్గా పేరుతో తెరకెక్కిన సినిమాకు ఎస్.దుర్గగా మార్చాల్సివచ్చింది. అక్షయ్‌కుమార్ లీడ్‌రోల్‌లో లారెన్స్ కాంచన రీమేక్‌గా 2020లో రిలీజ్ అయిన సినిమా లక్ష్మీబాంబ్‌గా తొలుత టైటిల్ ఫిక్స్ చేయగా హిందూ సంఘాల అభ్యంతరాలతో లక్ష్మీగా మార్చేశారు. 2013లో సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో వచ్చిన రామ్-లీలా అభ్యంతరాల తర్వాత గోలియోన్ కీ రాస్‌లీలా రామ్-లీలాగా టైటిల్ మార్చేశారు. 2024లో మమ్ముట్టి నటించిన 'భ్రమయుగం' పేరుతో విడుదలకు ముందే కొడుమోన్ పోట్టిగా మార్చాల్సివచ్చింది. ఇవే కాకుండా కంగనా రనౌత్ తలైవి, అనుష్క రుద్రమదేవి, రిషబ్‌శెట్టి కాంతార వంటి సినిమాలకు సైతం అభ్యంతరాలు వచ్చిన విషయం తెలిసిందే

అల్కరాస్‌కు ఎదురుందా?

- బరిలో సినర్, నొవాక్ జకోవిచ్
- నేటి నుంచి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్

ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ మహా సమరం అభిమానుల మదిలో మెదులుతుండగానే.. మరో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ సోమవారం నుంచి ఆరంభం కానుంది. డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుండగా.. వరల్డ్ నెం.1 జానిక్ సినర్ (ఇటలీ), నొవాక్ జకోవిచ్ (సెర్బియా) అతడికి గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



లండన్ (ఇంగ్లాండ్) : ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌కు రంగం సిద్ధమైంది. రెండు సార్లు డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) ఆల్ ఇంగ్లాండ్ సెంటర్ కోర్టులో హ్యాట్రిక్ టైటిల్‌పై కన్నేసి బరిలోకి దిగుతున్నాడు. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో మ్యాచ్ పాయింట్‌ను కాచుకుని జానిక్ సినర్‌కు ఊహించని షాక్ ఇచ్చిన అల్కరాస్.. వింబుల్డన్‌లోనూ టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నాడు.

పచ్చిక కోర్టుపై అల్కరాస్ వేగం, సుదీర్ఘ ర్యాలీలు, బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లు సహా సూపర్ సర్వ్‌ను ఎదుర్కొని నిలబడటం ప్రత్యర్థులకు కఠిన సవాల్‌గా నిలువనుంది. సోమవారం తొలి రౌండ్ మ్యాచ్‌లో ఇటలీ ఆటగాడు పాబియో ఫోగ్నినితో కార్లోస్ అల్కరాస్ తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నెం.1 అరినా సబలెంక (బెలారస్), ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ కొకొ గాఫ్ సహా ఇంగ్లాండ్ స్టార్ ఎమ్మా రెడాకాను టైటిల్ వేటలో ఫేవరేట్లుగా కనిపిస్తున్నారు.

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ నేటి నుంచి ఆరంభం కానుండగా.. తొలిరోజే కీలక ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కరాస్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ నేడు రాకెట్ పట్టనున్నారు. రష్యా స్టార్ ఆటగాడు డానిల్ మెద్వదేవ్, అమెరికా ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్, రూనె, బెరెటాని, ఒలీవర్, స్టెఫానోస్ సిట్సిపాస్‌లు నేడు తొలి రౌండ్లో ఆడనున్నారు. మహిళల సింగిల్స్‌లో అరినా సబలెంక, ఫెర్నాండేజ్, ఎలినా స్విటోలినా, ఒస్టాపెంకో, మడిసన్ కీస్, జాస్మిన్ పావొలిని, ఎమ్మా రెడుకానులు తొలి రౌండ్లో ఆడనున్నారు. వింబుల్డన్ మ్యాచులు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆరంభం అవుతాయి. భారత్‌లో స్టార్‌స్పోర్ట్స్ నెట్‌వర్క్ వింబుల్డన్ మ్యాచులను ప్రసారం చేస్తుంది.



సెమీస్‌లో నిఖత్ జరీన్

- జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్

హైదరాబాద్ : హైదరాబాద్ వేదికగా జరుగుతున్న జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. 51 కేజీల విభాగంలో పోటీపడిన నిఖత్ జరీన్ 5-0తో కల్పన (శాయ్)పై ఏకపక్ష విజయం సాధించింది. యూత్ వరల్డ్ మాజీ చాంపియన్ అంకుషిత బోరో 65 కేజీల విభాగంలో 5-0తో రాజస్థాన్ బాక్సర్‌ను చిత్తు చేసి సెమీఫైనల్లో ప్రవేశించింది. 48 కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ మహి వజీర్ 0-5తో మంజు రాణి చేతిలో ఓటమి చెందింది. 54 కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ నిరుపమ 0-5తో పరాజయం పాలైంది.

కృతిమ మేధతో నేరాల నియంత్రణ : డిజిపి

- గుంటూరులో ముగిసిన పోలీసు హ్యాక్‌థాన్-2025



ప్రసంగిస్తున్న డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కృత్రిమ మేధా (ఎఐ)ను వినియోగించుకొని ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత మెరుగ్గా అందించనున్నట్టు రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర పోలీసుశాఖ ఎఐ టెక్నాలజీపై మూడు రోజులపాటు గుంటూరు ఆర్‌విఆర్ కళాశాలలో నిర్వహించిన పోలీసు హ్యాక్‌థాన్-2025 ముగింపు సభ ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిజిపి పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాక్‌థాన్‌కు 160 మంది ధరఖాస్తు చేసుకోగా వాటిలో జనరేటివ్ ఎఐ, ఎజెంటిక్ ఎఐ 60 కంపెనీలను, ఓఐ నిపుణులను ఎంపిక చేసుకొని కృత్రిమ మేధ సహాయంతో నేరాల నియంత్రణ, పర్యవేక్షణ, దర్యాప్తులోని సవాళ్లకు ఉత్తమమైన పరిష్కారాలను ఆవిష్కరించామని చెప్పారు. రాష్ట్రంలోని 30 మందికిపైగా సీనియర్ ఐపిఎస్ అధికారులు, యువ ఐపిఎస్‌లు నేరాల నియంత్రణ, దర్యాప్తులో ఉన్న అనేక సమస్యల పరిష్కారాలకు ఎఐ నిపుణుల సాయంతో కృత్రిమ మేధను వినియోగించుకునే ప్రక్రియపై చేసిన కసరత్తు ఫలవంతమైందన్నారు. వీటిని రానున్న ఆరు నెలల్లో పోలీసు శాఖలో అమలుచేసి నేరాలను నియంత్రించటంతోపాటు, ప్రజలకు పోలీసు సేవలను మెరుగ్గా అందిస్తామని తెలిపారు. భవిష్యత్తులోను కృత్రిమ మేధను మరింతగా వినియోగించుకునేలా పోలీసు శాఖ ప్రణాళికలు రూపొందిస్తోందని, ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తుందని పేర్కొన్నారు. కృత్రిమ మేధ ద్వారా నేరాలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. 4సైట్‌ఎఐ సిఇఒ సూర్య మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో జనరేటివ్ ఎఐ, ఎజెంటిక్ ఎఐలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. కత్రిమ మేధలో నైపుణ్యాలు పెంపొందించుకోవటానికి ఆసక్తి ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థులు 4సైట్‌ఎఐ సంస్థను సంప్రదిస్తే పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. హ్యాక్‌థాన్‌లో ఎనిమిది విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు రూ.75 వేలు, రన్నర్లకు రూ.50 వేలు చొప్పున మొత్తం రూ.10 లక్షల నగదు బహుమతులను డిజిపి అందజేశారు. విజేతలుగా విజయనగరం, బాపట్ల, ఏలూరు ఎస్‌పిలు వకుల్ జిందాల్, తుషార్ దూడి, శివప్రతాప్ కిషోర్, డిఐజి ఫకీరప్ప, కమాండెంట్ మలికా గార్గ్, ఐజి రాజకుమారి నిలిచారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68